ప్రజాశక్తి

Vol. 3, no. 8

(Aug. 25, 1943)

బెజవాడ, 1943

Record no. 683

Prajāśakti

Vol. 3, no. 8

(Aug. 25, 1943)

Bejavāḍa, 1943

Record no. 683

0-2-0 Regd. No. M. 4486

ప్రజా★శక్తి

భారత కమ్యూనిస్టుపార్టీ, ఆంధ్రకమిటీ పత్రిక

సంపుటి 3 సంచిక 8	: సంపాదకవర్గం : మద్దుకూరి చంద్రశేఖరరావు (సం) కంభంపాటి సత్యనారాయణ	★	పుచ్చలపల్లి సుందరయ్య తుమ్మల వెంకటరామయ్య చలసాని వాసుదేవరావు	బుధవారం 25-8-43

"ఒకే రంగం - ఒకే ఆదర్శం ఒకే లక్ష్యం"

చైనా యోధుల సందేశం

డాక్టరు బి. కె. బాసు

ఆవేళ ఉదయం సోవియట్ విప్లవం యొక్క 25వ వార్షికోత్సవం జరుపుకుంటున్నాం. యన్నాన్‌లోని కమ్యూనిస్టుపార్టీ కేంద్ర కమిటీ శిక్షణ శిబిరంలో నృత్య, సంగీతాలతో ఆ మహోత్సవాన్ని జరుపుతున్నాం. ఇంతలో నాభుజాన్నెవరో తట్టారు. వెనుతిరిగి చూచాను జనరల్ చూ‌తే "రేపుదయం నన్ను కలుసుకోండి - మీకొక కబురుచెప్పాలి" అన్నాడు.

మరునాడు ఉదయం వాన్గ్‌గియా పిన్గ్‌కుగ్రామానికి వెళ్ళాను. చైనా కమ్యూనిస్టుపార్టీ మిలిటరీ కేంద్రం ఈగ్రామం. చూతే నన్ను ఎంతో ఆదరంతో ఆహ్వానించాడు. చుంకిన్గ్ నుంచి వచ్చిన ఒక రహస్య తంతివార్త నాకు చదివి వినిపించాడు. మానాన్నగారికి చాల జబ్బుగా ఉందని ఆవార్త. నాకు పిడుగు పడినట్లయింది. యన్నాన్‌లో అయిదేళ్ళు గడిపాను. తమ ప్రజ, తమ మాతృదేశంపట్ల అంతులేని ప్రేమతో, దేశస్వాతంత్ర్యంకోసం సర్వస్వార్పిస్తూ, పవిత్రసమరం సాగిస్తున్న చైనా వీరయోధుల నెందరినో ఆప్తమిత్రులుగ సంపాదించుకున్నాను. వీరినందరిని విడచిపోవడమా?

అయిదేళ్లక్రితం

చైనా ప్రజల అమోఘ సాహస, త్యాగాలతో ఉత్తేజితులై, వారు సాగిస్తున్న సమరం మీద మనదేశ భవిష్యత్తుకూడా ఆధారపడి ఉన్నదని గుర్తించి, పండిత జవహర్లాల్ మొదలైన మన నాయకులు, చైనాపట్ల మన భక్తి ప్రేమలకు చిహ్నంగా ఒక వైద్యదళాన్ని పంపారు. అయిదేళ్ళక్రిందట డాక్టర్ అటల్ నాయకత్వంతో మేము అయిదుగురు డాక్టర్లం చైనాకువచ్చాం. హాన్‌కౌ, ఇచాన్గ్, చుంకిన్గ్‌లలో అయిదు నెలలు గడిపిన తరువాత మమ్మల్ని కమ్యూనిస్టుసేన కేంద్రమయిన యన్నాన్ నగరానికి పంపారు. అప్పటినుంచి అదే నాస్థానమయింది. కొంతకాలం యన్నాన్‌లో ఉంటూ, మరికొంతకాలం జపానుశ్రేణుల వెనుక గెరిల్లాలతో ఉంటూ అక్కడ నాకాలం అంతా గడిపాను.

చైనాప్రజానీకం ఎంతో ఆదరంతో మమ్మల్ని ఆహ్వానించారు; పీడిత భారత సోదరుల 'రాయబారులు'గ మమ్మల్ని చూచారు. అక్కడి భాష, వ్యవహారాలు, శీతోష్ణస్థితి, అన్నీ కొత్తవే. అయినా ఆసోదరజాతిమధ్య కొద్దిరోజులు గడిపామో లేదో స్వగృహంలో ఉన్నట్లే అనిపించింది.

చైనాకు కావలసిన వైద్య సహాయం అపారం. అందులో మేమయిదుగురం ఏమాత్రం? కాని, ఆయా యుద్ధరంగాల్లో చైనాసోదరులకు సేవచేస్తూ మేము జరిపిన స్వల్పమాత్రకృషి కూడా మన దేశానికి వాళ్ళ దేశానికి మధ్య అనురాగబంధాల నెంతో బలపరచింది.

1940లో అటల్ ఆరోగ్యం చెడడంవల్ల ఇండియాకు వచ్చేశాడు. నేను, కొట్నిస్ అక్కడే ఉండి, ఆధీరజాతికి సేవచేయ నిశ్చయించుకొన్నాం.

ఆందోళన — ఆశ

ఆతరువాత ఆందోళనకర సంఘటనలు ప్రారంభమయాయి. మలయా, సింగపూర్, బర్మా—ఇవన్నీ జపాను ఫాసిస్టు హంతకుల చేతుల్లో పడ్డాయి.

పవిత్ర మాతృదేశం సరిహద్దుపైకి ఆరాక్షసులు చేరుకున్నారు. ఇన్నిసంవత్సరాలు చైనాలో మాకళ్ళారచూచిన ఘాతుక కృత్యాల నన్నిటిని ఈఫాసిస్టు పిశాచాలు సోదరభారతీయులమీద జరుపనున్నారు. ఈభావాలు మమ్మల్ని, చైనా సోదరుల్ని, ఎంతో ఆరాటపరిచేవి. ఆందోళనతో పరిస్థితుల్ని పరిశీలించేవాళ్ళం.

క్రిప్స్ రాయబారం రోజులవి. జవహర్లాల్ దేశరక్షణశాఖ మంత్రి అవుతాడని వదంతులు వ్యాపించాయి. చైనాపత్రికలన్నీ వాటిని ప్రధానంగా ప్రచురించేవి. కామ్రేడ్స్ మో, చూతే, ముఖాల్లో ఆందోళన అంతరించింది— ఆశ, ఆనందం అంకురించాయి. మా అందరి ఆశలు మిన్నంటాయి.

కాని, మరునాడే ఈఆశలన్నీ అడియాసలయాయి.

ఒకనాడు వాన్గ్ చియా షియాన్గ్ (చైనా కమ్యూనిస్టుసేనయొక్క రాజకీయనాయకుడు)కి చికిత్సచేస్తున్నాను. నేను తూర్పు బెంగాల్ నుంచి వచ్చానని తెలుసుకొని, "అయితే ఏమి చేయదలచుకున్నార"ని ఎంతో ఆతృతతో అడిగాడు. ఏమిటిచేయడం?

అన్నివైపులనుంచి నాకు జవాబువచ్చింది. కమ్యూనిస్టు సేనలోని ఉద్యోగులు, సైనికులు అందరూ ఏక కంఠంతో - "వెళ్ళండి - మీ దేశానికి వెళ్ళి ఈ ఫాసిస్టు నరహంతకుల్ని ప్రతిఘటించడానికి మీ ప్రజల్ని ఉత్తేజపరచండి. గెరిల్లా దళాలనుతయారుచేయండి. కొనఊపిరితోనైనాసరే స్వాతంత్ర్యం కోసం పోరాడేలా చేయండి." అని సలహా ఇచ్చారు. క్రూర శత్రుమూకల్ని ఏళ్ళ తరబడి ఎదిరించి, యుద్ధ నైపుణ్యాన్ని జీర్ణించుకొన్న ఆయోధులు ఈసలహా ఇవ్వడంలో విశేషంలేదు.

ఆగష్టు ఘటనలు

ఆతరువాత ఆగస్టు ఘటనలు ప్రారంభమయాయి. కామ్రేడ్ చూతే ముఖంలో ఎప్పుడూ ఆందోళన కనబడేది. ఇండియాలో విధ్వంసక కార్యక్రమాలను గురించి ఆలోచిస్తుండేవాడు. ఆచర్యల్లో ప్రతి ఒక్కటీ ఇండియాకు జపాను ప్రమాదాన్ని హెచ్చించడమే కాకుండా - అయిదేళ్ళపాటు ఏకాకిగా నిలచి, అష్టకష్టాలకోర్చి స్వాతంత్ర్య సమరం సాగిస్తున్న చైనాకు వెన్నులో బాకుపోటు లాంటిదని ఆయోధుడు వెంటనే గ్రహించాడు.

ఆరోజుల్లో కొట్నిస్‌నుంచి ఆతృతతో సందేశం వచ్చేది - "నాకోసం ఆగు - మనిద్దరం కలిసివెళ్దాం" అని. అతనప్పుడు మాకు 600 మైళ్ళ దూరంలో జపానుశ్రేణుల వెనుక పనిచేస్తుండేవాడు. అతను నాదగ్గరకు రాడానికి ప్రయత్నాలు పూర్తికాకముందే ఆ వీరుడు చనిపోయాడు. ఈ నాడా దూరదేశంలో, పైపిన్గ్ నగరం దగ్గర ఒక లోయలో, అతని సమాధిపై మన జాతీయ పతాకం సగర్వంగా ఎగురుతూంది - చైనా స్వాతంత్ర్య సమరంకోసం ఒక భారత పుత్రుడు చేసిన త్యాగాన్ని ప్రపంచానికి చాటుతూంది.

ఇక నేనొక్కణ్ణే ఇంటికి తిరిగిరావాలి. నేను బయలుదేరవలసిన రోజు సమీపిస్తున్నకొలదీ యన్నాన్‌లోని ప్రజలు, సైనికులు పార్టీ సభ్యులు అందరూ నాదగ్గరకువచ్చి —

"మీరూ మేమూ నిలచి ఉన్నది ఒకేఒక ప్రజారంగంలో; మనం పోరాడుచున్నది ఒకే ఒక ఫాసిస్టు ప్రతికూల ఉద్యమంకోసం - మన లక్ష్యం కూడా ఒకటే. ఇద్దరం ఏకమై ఫాసిస్టులను హతమార్చి, స్వాతంత్ర్యం పొందుదాం అన్న విషయాన్ని మీ ప్రజలకు చెప్పండి" అని కోరేవారు.

వచ్చేనేముందు ఒకనాడు కామ్రేడ్ మో నన్ను భోజనానికి పిలిచాడు. మో అంటే అక్కడందరికీ పంచప్రాణాలు. మో ఉండే చోటికి వెళ్ళుటకు చూతే తన గుర్రాన్నిచ్చాడు. యన్నాన్ వెలుపల మూడుగుహల్ని కలిపి మో నివాసస్థానంగా ఏర్పాటుచేశారు.

మో సందేశం

మో ఇలా అన్నాడు: "మాదికూడా అర్ధవలస జాతే. గత వందసంవత్సరాలనుంచి మా జాతివిముక్తికోసం పోరాటం సాగిస్తున్నాం. ఈ పోరాటంలో చాలదూరం సాగివచ్చాం. కాని, ఇంకా చాలదూరం పోవలసి ఉంది." అని చెప్పి విప్లవోద్యమం ఎలా పెరుగుతూ వచ్చిందో చెప్పాడు. జపాన్ని ప్రతిఘటించడంలో చైనాఅంతా ఏకమవడం గురించి యిలా అన్నాడు:

"చైనాలో అన్నిపార్టీలు ఏకమయాయి కాబట్టే మేము జపాన్ని ప్రతిఘటించగలుగుతున్నాం. చైనాలోని అభివృద్ధి నిరోధకుల రెచ్చగొట్టడాలుకాని, శత్రువుల కుతంత్రాలుగాని, ఈఐకమత్యానికి భంగం కలిగించడానికి మేము అవకాశం కలిగించలేదు. ఆయాపార్టీలమధ్య తీవ్రమైన విభేదాలుంటాయి. ఉదాహరణకు యిటీవల అభివృద్ధినిరోధకులు కమ్యూనిస్టు సేనమీద సాగించిన దాడి చూడండి. మేమాచర్యను ఖండించాం. కాని, అప్పుడు కూడా ప్రధాన శత్రువు జపానన్న సంగతిని మరచిపోలేదు."

భారత కమ్యూనిస్టుపార్టీ పట్ల తన ఉత్సాహాన్ని తెలిపాడు. జోషికి విప్లవాభివందనాలందజేయమన్నాడు. చివరికి, చైనా సంప్రదాయం ప్రకారం ఒక నీలంగుడ్డ (అక్కడి పారిశ్రామిక కో-ఆపరేటివ్‌లో తయారైంది) పైన "చైనా, భారత, జాతుల స్వాతంత్ర్యం, విముక్తి, చిరస్థాయి యగుగాక" అని తానే స్వయంగా రాసి యిచ్చాడు. అతని చేతిని విడువలేక, విడువలేక విడిచి, సెలవు తీసుకున్నాను.

చూతే ఉద్బోధ

మరునాడు చూతేదగ్గర సెలవు తీసుకున్నాను. 17 సంవత్సరాలనుంచి యుద్ధరంగంలో నిలచి స్వాతంత్ర్య సమరం నడుపుతున్న ఆ యోధుడు, ఎంతో అభిమానంతో నాచేతిని పట్టుకొని,

"డాక్టర్ బాసు, మీదేశంలో జపానుకు ప్రతికూలంగా మీ ప్రజల్నందరినీ సమీకరించాలి. ఇది చాల అవసరం. మీవాళ్ళకు మిలిటరీ శిక్షణగాని, అనుభవంగాని లేదు. మీ లోటులన్నిటిలోకి అదే ప్రమాదకరమయింది. ఈ కారణంచేతనే మీపైని ఇతరులు నిర్ధాక్షిణ్యంగా దండెత్తి, ఓడించగలిగారు. ఇప్పుడు మీకు దొరుకుతూన్న అవకాశాలను పోనివ్వకండి. మీరందరూ, పెద్దలు - పిన్నలు, స్త్రీలు పురుషులు, సైనికులుగా, గెరిల్లాలుగ తర్ఫీదు పొందండి. శత్రువును ప్రతిఘటించండి. మీ ప్రజల్లో అంతులేని దేశభక్తిని, అగాధమైన శత్రుద్వేషాన్ని పురికొల్పండి. మీదేశం, మాదేశం, స్వాతంత్ర్యం పొందడానికి అదొక్కటే మార్గం."

ఆమాటలు విన్నతరువాత, ఆ అయిదేళ్ళలోనేను చైనాలో పొందిన అనుభవం అంతా కళ్ళకు కట్టినట్లయింది. ప్రజల ఐక్య, సంఘటిత శక్తి నక్కడ కళ్ళార చూశాను.

"అయితే మా పరిపాలకుల సంగతేమిటి? మేము ఆయుధాలు పట్టడం వారికినచ్చదుగా?" అని చూతే నడిగాను.

చూతే చిరునవ్వు నవ్వి - "ప్రజలందరూ ఏకమై దేశాన్ని రక్షించుకోడానికి పూనుకుంటే, వాళ్ళనెవ్వరూ అడ్డగించలేరు. ఆపరిస్థితులలో మీ పరిపాలకులు, తమకు నచ్చినా నచ్చకపోయినా, మీకు ఆయుధాలివ్వకతప్పదు. వాళ్ళకిష్టమున్నా లేకపోయినా, హిట్లరు, టోజోల మీద యుద్ధం చేయకతప్పదు. ఈనాడు ఈ యుద్ధంలో విజయం సాధించగలది ప్రజలే," అని ఉద్బోధించాడు.

మన కర్తవ్యం

నేను బయలుదేరేముందే కామ్రేడ్ జోషి జాబు వచ్చింది - మరొక వైద్య దళాన్ని పంపడం గురించి. ఆవార్త విని వాళ్లందరూ ఎంతో సంతోషించారు. మరో వైద్యదళాన్ని పంపడం ఈనాడుమన దేశభక్తియుతకర్తవ్యం. అయిదేళ్ళ కిందట మనం పంపినదళం, తన ఉనికికోసం పోరాడుతూన్న ఒక వీరజాతిపట్ల సుహృద్భావచిహ్నం. కాని, ఈనాడు ఫాసిస్టు దుష్టశక్తి నెదిరించి పోరాడడంలో మన రెండు జాతులకు గల సుస్థిర ఐకమత్యానికి చిహ్నంగా ఉంటుం దీరెండో వైద్యదళం. 3000 మైళ్ళ దూరంలో డాక్టరు కొట్నిస్ సమాధిపై ఎగురుతూన్న మన జాతీయ పతాకం ప్రతిష్ఠను నిలుపగల దీరెండో వైద్యదళం.

బుధవారం ప్రజాశక్తి 25-8-43

బట్టలధరల కంట్రోలు

బట్టలకు, నూలుకు గరిష్టధరలను నిర్ణయించుతూ 19 వ తేదీన టెక్స్టైల్ కమిషనరు ప్రభుత్వఆర్డరును ప్రకటించాడు. ఈ మధ్య మిల్లుయజమానులు, వర్తకులు తీసుకొచ్చిన ఒత్తిడికి జంకి ప్రభుత్వం రెడీమేడ్ దుస్తులను, చేనేత బట్టలను కంట్రోలుస్కీమ్ నుంచి మినహాయించింది. అందువల్ల ప్రజలకు వచ్చే నష్టాన్ని గురించి క్రిందటివారం సంపాదకీయంలో తెలియజేశాము. ధరలు నిర్ణయించుతూ కొత్తగా ప్రకటించబడిన ప్రభుత్వఆర్డరు పై దుష్ఫలితాలను కొంతవరకు తొలగించుతుంది. పై మినహాయింపులను చూచి తిరిగి ఖరీదులను పెంచిన బట్టలవర్తకుల ఆట కట్టుతుంది.

ప్రభుత్వంచే నిర్ణయించబడిన ధరలు అగస్టు 31 తేదీ నుండి అమలులోకి వస్తాయి. వర్తకులకుమిల్లు యజమానులు అందచేయవలసిన గరిష్టధరలను ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ధరలపై నూటికి 20 కి మించకుండా వర్తకులు ప్రజలకు అమ్మవలసి వుంది. రవాణాచార్జీలు, వర్తకుల లాభాలు అన్నీ ఈ 20 లోనే సరిపుచ్చుకోవాలి. భారతదేశమంతా ఒకేవిధమైన ధరలకు ఈ మాదిరిగా ప్రజలకు బట్టలను అమ్మించడానికి ఇదే మొట్టమొదటి ప్రయత్నం. దీనిని ఖచ్చితంగా అమలు జరుపడానికి, తక్కినరకాల బట్టలధరలను కూడా కంట్రోలు చేయడానికి, ప్రజలు ఆందోళన చేయాలి. ఈ ధరలకు మించి అమ్మే దొంగవర్తకులను బట్టబయలు చేయడానికి, అమాయకులయిన ప్రజలకు నిర్ణయించబడిన ఖరీదులకే బట్టలు అందునట్లు చేయడానికి, ప్రజాసేవకులు కృషిచేయాలి. ఆహారం తరువాత ముఖ్యమైన బట్టల కంట్రోలు స్కీమును జయప్రదంగా అమలు జరుపడానికి, ప్రజల యిబ్బందులను తొలగించడానికి, పనిచేయడం దేశభక్తులు తమ కర్తవ్యంగా ఎంచాలి.

(1) దీనితోపాటు ప్రభుత్వస్కీములో వున్న లోపాలను వెంటనే తొలగించడానికి ప్రయత్నించాలి. ఇపుడు మొత్తం 10 రకాలకు మాత్రమే ధరలు నిర్ణయించబడ్డాయి. ఉదాహరణకు 10 గజాలు, 8 గజాలు ధోవతులచాపులకు, 5 గజాల రంగు చీరలకు మాత్రమే ధరల నిర్ణయం జరిగింది. ఆంధ్రదేశంలో బీదలు 6, 7 గజాల చాపులు, 7, 8 గజాల చీరలు హెచ్చుగావాడుతారు. అందుచే ప్రభుత్వం వెంటనే ఇట్టి యితర రకాల బట్టలకుకూడా ధరలు నిర్ణయించాలి.

(2) ఇప్పుడు నిర్ణయింపబడిన నూలు ధర చాల హెచ్చుగావుంది. 10 పౌన్ల పెట్టె 10 నెంబరు నూలుకు రూ 13-10-6, 20 నెంబరు నూలుకు రు 17-8-9 నిర్ణయించబడింది. యుద్ధానికి పూర్వం 10 నెంబరు రు 6-8-0, 20 నెంబరు 5-0-0 ఖరీదు మాత్రమే వుండేది. సాధారణంగా 10 వ నెంబరు నూలు దుప్పట్లకు మాత్రమే ఉపయోగిస్తారు. చీరలు, ధోవతులు, చొక్కాగుడ్డలు మొదలైన వాటన్నింటికీ 20 వ నెంబరు నూలు ఉపయోగిస్తారు. కాని దీనికి ప్రభుత్వం నిర్ణయించిన ధర దాదాపు 4 రెట్లు వుంది. ఇంత హెచ్చుగావుంటే చేనేతపరిశ్రమకు గిట్టుబాటువుండదు. చేనేత మగ్గాలను ప్రోత్సహించి, విరివిగా పనిచేయించితేగాని, దేశప్రజలకు సరిపోయినంత బట్ట తయారుగాదు. అందుచే ప్రభుత్వం వెంటనే నూలు ధరను యింకా మూడోవంతుకైనా తగ్గించాలి. చేనేత పారిశ్రామికులు చేసే యీఆందోళనలో ప్రజలంతా వారికి సాయంచేయాలి.

(3) ప్రస్తుతమున్న కంట్రోలుబోర్డు మిల్లు యజమానులతోనూ, వర్తకులతోనూ నిండివుంది. కార్మికుల ప్రతినిధి ఒకరే వున్నారు. కొనుగోలుదారులైన 40 కోట్ల ప్రజలకు ఒక ప్రతినిధి అయినాలేడు. ప్రజా ప్రతినిధులను కంట్రోలు బోర్డులో సభ్యులుగా నియమించాలి; కార్మిక ప్రతినిధుల సంఖ్యను వృద్ధిచేయాలి.

(4) ప్రజలందరికీ సరిపడినంత బట్ట తయారు కావాలంటే, ఉత్పత్తిని హెచ్చుచేయాలి. అందుకొరకు కార్మికుల సహకారంతో ప్రతి మిల్లులోనూ ఉత్పత్తి కమిటీలను నియమించాలి.

ప్రస్తుత స్కీమును పైవిధంగా విపులీకరించినపుడే ప్రజల ప్రధానావసరాలలో రెండోదైన బట్టలసమస్య పరిష్కారమవుతుంది. అందుకొరకు ప్రజాసేవకులు, దేశభక్తులు కృషిచేయాలి.

గ్రంధస్వీకారం

అమరజ్యోతి (పలనాటి యుద్ధానికి నాటకరూపము):
రచయిత: శ్రీ కాజ రాధాకృష్ణశాస్త్రి: వెల రు. 1—0—0
బందరులో తెలుగునాడు కార్యాలయం, అభిసారికా గ్రంథమాలలోను, బెజవాడ ఆంధ్రగ్రంథాలయ ప్రెస్, సరస్వతీ బుక్ డిపోలోను దొరకును.

నగ్నదృశ్యాలు:
రచయిత: శ్రీ యస్. జి. ఆచార్య (ప్రజాబంధు సంపాదకులు):
వెల రు. 0—6—0.
దొరుకుచోటు: చిత్రాంగి కార్యాలయం, 156 బ్రాడ్వే, మద్రాసు.

శ్రీ బులుసు రామజోగారావుగారి గ్రంథాలు:
Rule by Murder: (ముద్రణ, లిబర్టీ ప్రెస్, జి. టి. మద్రాసు);
కల్లరుజువ్ (ముద్రణ, భారతమాత ప్రెస్, ఆండర్సన్‌వీధి, జి. టి. మద్రాసు.)

★ మన రాజకీయాలు

● కలకత్తాలో చావులు
● బెంగాల్‌లో ధరల కంట్రోల్
● మద్రాసులో రేషనింగ్

బ్రిటిష్ సామ్రాజ్యంలో లండన్ తరువాత కలకత్తాయే పెద్దనగరం అని ప్రతీతి. కాని, ఈరోజున కలకత్తా వీధులలో జరిగే ఘటనల గూర్చి వింటే, గుండె నీరౌతుంది. ఆకలి బాధను తట్టుకోలేక వందలకొద్దీ ప్రజలు కలకత్తా రోడ్లమీద పక్షులవలె రాలిపోతున్నారు. ఈనెల 15 వ తేదీనుండి 19 వ తేదీవరకు ఆసుపత్రులలో చేర్చబడిన యిలాంటివారి సంఖ్య 445. వీరిలో 26 గురు చనిపోయారు. 20 వ తేదీని ఆసుపత్రులలో చేర్చుకున్న 161 రిలో, 19 మంది చనిపోయారు. కలకత్తా కార్పొరేషన్ హెల్త్ ఆఫీసరు యీవిషయమై ఒక రిపోర్టు యిచ్చాడు. అందులో అతడు ఆసుపత్రులకు చేర్చబడినవారిలో 100 కి 15 మంది మొదలు 25 వరకూ కలరాతో బాధపడుతూన్నట్లు తెలియజేశాడు. తక్షణమే యీసమస్యను ఉచితరీతిని పరిష్కరించకపోతే త్వరలో అంటువ్యాధులు ప్రబలి, ప్రమాద పరిస్థితి యేర్పడవచ్చునని అతడు వార్నింగ్ యిచ్చాడు. కలకత్తాలో యిప్పుడున్న ఉచితభోజనశాల లన్నింటినీ నగర పొలిమేరలకు మార్చడం అవసరమని అతడు సూచించాడు. ఈవిధంగా కాటక పరిస్థితులకు గురియౌతూన్నవారిలో అనాథస్త్రీలు, అమాయక శిశువులు, యెంతోమందిఉన్నారు. ఇండ్లవద్ద వీరికి తిండి లేక, వీధుల్లో దొరికిన ఎంగిలి మెతుకులయినా సరిపోక, ఆకలిబాధతో పోరాడి పోరాడి, చివరకు రోడ్లమీద పడిపోవలసివస్తూంది.

కామ్రేడ్
కంభంపాటి సత్యనారాయణ

ఈ దారుణపరిస్థితులనుండి ప్రజల్ని కాపాడడానికి వివిధ ప్రజాసంస్థలు, ఉదార స్వభావులు ఉచిత భోజనశాలలకు సహాయం చేస్తున్నారు. ముస్లిం వాణిజ్యసంఘంవారు కలకత్తాలో 8 ఉచిత భోజన శాలలు తెరిచారు. ఒక్కొక్క భోజనశాలలో రోజుకు 500 మందికి తిండి లభిస్తుంది. ఇలాగే, మార్వాడీ రిలీఫ్‌కమిటీవారు ప్రతిరోజూ 30 వేలమందికి గంజి, 25 వేల మందికి పులుసు- అన్నం (కిచిడీ), 50 వేల మందికి చౌక రొట్టెలు, యివ్వడానికి 10 లక్షల రూపాయలస్కీము ఒకటి వేశారు. ఇప్పటికి 3½ లక్షలు వసూలయింది. కలకత్తాకార్పొరేషన్ 20 వ తేదీని జరిపిన ప్రత్యేక సమావేశంలో, అమెరికా- ఆస్ట్రేలియాలనుండి బెంగాల్‌కు ఆహారపదార్థాలను పంపవలసిందని కోరుతూ చర్చిల్- రూజ్‌వెల్టులకు టెలిగ్రాం (కేబిల్) పంపించవలసి తీర్మానించబడింది.

బెంగాల్ ప్రభుత్వకృషి

బెంగాల్ ప్రభుత్వంకూడా యీ విషయమై ఉపేక్షాభావంతో ఊరుకోవడంలేదు. బియ్యం గాని, ధాన్యంగాని, బెంగాల్ రాష్ట్రంనుండి ఎక్కడికీ పంపకూడదని నిషేధం విధించారు. ప్రభుత్వం తరఫున ఒక కేంద్రరిలీఫ్‌కమిటీని నియమించారు. ధాన్యం ధరలమీద, బియ్యం ధరలమీద, కంట్రోల్ ప్రవేశపెట్టారు. అగస్టు 28 తరవాత ధాన్యం మణుగు 1 కి రు 15, సెప్టెంబరు 10 తరవాత రు. 12-8-0, సెప్టెంబరు 25 తరవాత రు. 10, కంటె ఎక్కువ ధరలకు అమ్మరాదనీ, బియ్యం ఆగస్టు 28 తరవాత మణుగు 1 కి రు. 30, సెప్టెంబరు 10 తరవాత రు. 24, సెప్టెంబరు 25 తరవాత రు. 20, కంటె ఎక్కువ ధరలకు అమ్మరాదనీ విధించారు. (మణుగు అనగా 40 శేర్లు: శేరుకు 80 తులాలు) ఇవి టోకు ధరలు. చిల్లర వర్తకులు ఈ ధరలపై రు. 2 అదనంగా అమ్మవచ్చును. ప్రభుత్వంకూడా మిగులు ప్రదేశాలలో రైతులవద్ద, వర్తకుల వద్ద, పైకంట్రోలు ధరలకు మించకుండా సరుకుని కొని, అమ్ముటకు ఏర్పాట్లు చేయబోతూన్నట్లు ప్రకటించింది. ఈ రేట్లు, ముఖ్యంగా ఆగస్టు 28 - సెప్టెంబరు 10 తేదీలమధ్య అమ్మవలసిన రేటు, చాల ఎక్కువే అయినప్పటికీ, ధరల కంట్రోలు అనే సూత్రాన్ని అంగీకరించి ఆచరణలో పెట్టడం యితర రాష్ట్ర ప్రభుత్వాలకు మార్గం చూపడం అవుతుంది. ధరలపై కంట్రోలు తీసివేయడంవల్ల (మార్చి 11) నిలవ వ్యాపారస్థులు సరుకును ధారాళంగా మార్కెట్టుకు తీసుకువచ్చి ప్రజలకందుబాటులో వుండేధరలకు అమ్ముతారనే ఆశ పూర్తిగా యిప్పుడు భగ్నమయినట్లు బెంగాల్ ప్రభుత్వం అంగీకరించడం ఇతరరాష్ట్ర ప్రభుత్వాలకు గుణపాఠం. బెంగాల్ పరిస్థితులే యితరరాష్ట్రాలకు కూడా వ్యాపించకుండా కేంద్రప్రభుత్వంముందుగానే మేలుకొని, ధాన్యానికీ - బియ్యానికీ ధరల కంట్రోలు ప్రవేశపెట్టడం అవసరం.

మద్రాసులో రేషనింగ్

కలకత్తా పరిస్థితులే మన రాష్ట్రంలో కూడా లేకపోయినా, మద్రాసు మొదలైన పట్టణాల ఆహారపదార్థాలు. తిండి దొంగల స్వాధీనంలో ఉన్నాయి. వారి విషకౌగిలి నుండి ప్రజల్ని రక్షించడానికి రేషనింగు చాలావరకు పనికివస్తుంది. ఒకటిరెండు వారాలలో మద్రాసులో రేషనింగు ప్రవేశపెట్టబడుతుందని ప్రభుత్వ ప్రతినిధి తెలియజేస్తూ, వివరాలతో ఒక స్కీమును ప్రకటించాడు. అగస్టు 22 మొదలు 24 వరకు రేషన్ కార్డులు మద్రాసు పౌరులందరికీ పంచిపెట్టబడతాయి. ఒక్కొక్క వ్యక్తికిరోజుకు బియ్యం2¼ అకాకులకంటె ఎక్కువ యివ్వరు (అకాకు అనగా పావుశేరు). పనిచేసే కార్మికులకు మాత్రం 3¼ అకాకులచొప్పునయిస్తారు. 2-12 సంవత్సరాల మధ్యవయస్సుగల పిల్లలకు 1¼ అకాకుల చొప్పున యిస్తారు. ఈపద్ధతి ప్రకారం సరుకు అమ్మడానికి 500 మంది వర్తకులకు లైసెన్సు లిచ్చారు. ఒక్కొక్క వర్తకుడు వారానికి 500 మందికి ఎక్కువగా అమ్మకూడదు; ఏధరకు అమ్మాలో కూడా ప్రభుత్వం త్వరలో నిర్ణయిస్తుంది. మిగులు ప్రదేశాలలో భూములుఉండి, సొంత వినియోగానికి బియ్యం తెప్పించుకొనేవారికి మాత్రం రేషన్‌కార్డులియ్యరు. కార్డులలో రెండురకాలుంటాయి: (1) ప్రతిరోజూ కొనుక్కునేటందుకు, (2) వారానికొకసారి గాని, రెండుసార్లుగాని, కొనుక్కునేటందుకు. వివాహాలు, విందులు (మిగతా 7 వ పేజీలో)

విధ్వంసకచర్యలను మానండని దేశభక్తుల హెచ్చరిక

[అగస్టు 9 ప్రశాంతంగా గడచిపోయింది. అమెరీకీ సాకుగాని, బోసుకు ప్రోత్సాహంగాని, లభించే విధ్వంసక చర్యలను ప్రజలు గావించలేదు. దీనికి కారణం ఇటీవల జైళ్ళనుండి విడుదలయిన దేశభక్తులు గావించిన హెచ్చరికలే. ఈ క్రింది ప్రకటనలుచూస్తే, దేశభక్తులలో ఎంతమార్పువచ్చిందీ స్పష్టమవుతుంది. కాని ఒక్క విధ్వంసక చర్యలను ఖండించుటతోనే సరిపోదు. ఆహారసమస్యా పరిష్కారానికి, నాయకుల విడుదలకు, ప్రతిష్టంభన అంతమొందించడానికి, పూనుకోవాలి. ఇటీవల సరోజినీ నాయుడు ఇచ్చిన హెచ్చరిక అట్టి నిర్మాణకృషికి ఉత్సాహమిస్తోంది.]

★

అహమ్మదాబాద్ సిటీ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు జీవన్‌లాల్‌దివాన్, మరి నల్గురు రాష్ట్రకాంగ్రెసు సభ్యులు, ఇంకా అనేక కాంగ్రెసు - మహిళా - మజ్దూర్ మహాజన్ సంఘ నాయకులు కలసి ఇలా విజ్ఞప్తిచేశారు.

"వీరుల స్మారకచిహ్నంగా ప్రతినెలా 9 వ తేదీన రాళ్ళు రువ్వుతున్నట్లు పత్రికలలో వార్తలు చూస్తున్నాం. ఇది కాంగ్రెసు కార్యక్రమమనే తప్పుడు భావన కలుగచేస్తుంది. కాంగ్రెసు సత్యాహింసలకు ఈచర్యలు విరుద్ధం. అన్ని పరిస్థితులలోను శాంతంగాఉండండి. కాంగ్రెసు సత్యాహింసలు వదలిపెట్టిందనే నిందలకు తావులేకుండా చేయడానికి శాంతంగా వుండాలి."

ఇంతేగాదు, గత 2 నెలలలో విడుదలైన 700 మంది కాంగ్రెసువాదులు, తిండిసమస్య-రాజకీయ ప్రతిష్టంభన చూచి ఆందోళనపడ్డారు. తమపేరిట కాంగ్రెసుకు చెడ్డపేరు తేవడంచూసి, విధ్వంసకచర్యల్ని ఖండించారు.

శ్రీయుత నరహరిభాయిపరిక్ గాంధి ఆశ్రమవాసి. పేరుగన్న నాయకుడు. "హింసకు, రహస్యచర్యలకు" కాంగ్రెసులో తావు లేదంటూ ఒక కరపత్రం ప్రకటించాడు.

'దొంగకరపత్రాలను నమ్మకండి'

"కాంగ్రెసుపేరిట ఎవరో ప్రకటించే కరపత్రాలను నమ్మకండి" అంటూ, విధ్వంసక చర్యలను ఖండిస్తూ, తూర్పుఖాండేష్ కాంగ్రెసునాయకులు ముగ్గురు (పుసాల్కర్, కొఠారి, ఉక్‌భాయిహునావాని,) ఒకప్రకటన గావించారు.

ఇలా ప్రకటన గావించుతున్నారని తెలిసి, కాంగ్రెసు సోషలిస్టులు అక్కడకు పరుగెత్తారు. ఈయకుండా చేయాలని ప్రయత్నించారు. కాని, లాభం లేకపోయింది. "దేశద్రోహులు, పిరికిపందలూ, కమ్యూనిస్టుల చేతిలో కీలుబొమ్మలు" అంటూ, ఆ నాయకులను తిడుతూ పోస్టర్లు అంటించారు. కాని, ప్రజలు వాటిని చూడగానే చింపివేశారు. అమాల్నర్‌లో, అంటించేవారిని కాళ్ళకుబుద్ధి చెప్పేటట్లు, ప్రజలు తరిమారు.

'కాంగ్రెసుకు మచ్చదెస్తున్నారు'

పంజాబు సుప్రసిద్ధ కాంగ్రెసు నాయకుడు డాక్టర్ కిచ్లూ, కాంగ్రెస్, విధ్వంసకచర్యలకు కారణమన్న నిందను ఖండించుతూ, అగస్టు 9 ని గురించి ఈప్రకటన చేశాడు. "9 వ అగస్టులోగా ప్రతి ఇంగ్లీషువాణ్ణి చంపండని హెచ్చరిస్తూ, కొందరు లాహోర్‌లో కరపత్రాలంటించారని తెలిసింది. గాంధీజీ,కాంగ్రెసుకూ, జాతీయోద్యమానికీ, నాయకుడుగా ఉన్నన్నాళ్ళు, విధ్వంసకచర్యలు — హింస, ఏరూపంలోగాని జరుపగూడదు.

"అందుచే, పైన చెప్పినలాంటి ప్రచారం ఉత్త బూటకం. అది, కాంగ్రెసుకు మచ్చదెచ్చే ప్రయత్నం."

"మీకూ — దేశానికీ నష్టం"

"అగస్టు 9 ని సమ్మెచెయ్యడం, మీకూ దేశానికీ నష్టం" అంటూ కాటోల్‌లో 25 మంది కాంగ్రెస్ వాదులు కార్మికులను హెచ్చరించారు. వీరు అగస్టు 1 న సమావేశమై విధ్వంసక చర్యలను ఖండించుతూ, అగస్టు తీర్మానంలోని "పోరాటానికి సంబంధించిన భాగం" తీసివేయాలనీ తీర్మానించారు.

"కాంగ్రెసు ప్రతిష్ట గంగపాలు కానున్నది!"

ఖుల్నా కాంగ్రెసు నాయకుడు, నగేంద్రనాథ్‌సేన్ యం. యల్. ఎ. ఇలా ప్రకటించారు. "మళ్ళా 1942 లో వలె విధ్వంసక చర్యలకు ప్రయత్నాలు జరుగుతున్నాయని విన్నాను. తక్షణం వాటిని అరికట్టాలి. కాంగ్రెసుపేరు గంగపాలు కానున్నది. అలా జరగకుండా అన్నివిధాలా ప్రయత్నించాలి. ఆహారసమస్యా పరిష్కారానికి, హిందూ ముస్లిం ఐక్యతకు పనిచేయడం ఈనాడు దేశభక్తితో గూడిన కర్తవ్యం."

"పంచమాంగదళాన్ని బయటపెట్టండి."

ఢిల్లీ రాష్ట్ర కాంగ్రెసు సభ్యులు 5 గురు, ఇటీవల విడుదలయిన కాంగ్రెసు వర్కర్లు, మరికొందరు కాంగ్రెసు వాదులు మొత్తం 30 మంది, ఆగస్టు 9 న శాంతియుతంగా ఉండవలసిందని కరపత్రాలు పోస్టర్లూ ఢిల్లీలో అంటించారు. వారి విజ్ఞప్తి సారాంశం ఇది: "కాంగ్రెసుపేరిట, గాంధిజీపేరిట విధ్వంసక చర్యలు చేసే వారు దేశాన్ని తప్పుడుమార్గాన పెడుతున్నారు. నాయకులవిడుదలకు అడ్డంకిగా పని చేస్తున్నారు. వారు కాంగ్రెసుకు చెడ్డపేరు తెచ్చారు. మనం ఈ ప్రజాశత్రువులనుండి కాపాడుకోవాలి. మన జాతీయ సంస్థ గౌరవం కాపాడాలంటే, ఈ దేశద్రోహాన్ని బయటపెట్టాలి."

"ఫాసిస్టులకు సహాయపడే చర్యలు మానాలి."

అఖిలభారత కాంగ్రెసు సభ్యుడు, రాజా చిదంబరం, పెరువాలనల్లూరునుండి, తిరుచునాపల్లి జిల్లా కమ్యూనిస్టుకమిటీకి లేఖవ్రాస్తూ ఇలా అన్నాడు. "గాంధీజీ ఉత్తరాలు ప్రకటించబడిన తర్వాత, నిజమైన కాంగ్రెస్‌వాది ఎవ్వడూ విధ్వంసకచర్యలలో పాల్గొనడు. ఎప్పుడూ ఫాసిస్టు వ్యతిరేకంగాఉన్న కాంగ్రెస్ యెడల విధేయతగా ఉండాలంటే; ఫాసిస్టులకు పరోక్షంగానో ప్రత్యక్షంగానో సాయపడే ఏ పనినీ చేయగూడదు."

ఆంధ్రదేశంలో ఆహారసమస్య

క్రరువులో అధికమాసంలాగా ఖమ్మంమెట్టులో కూలీలకు ఇస్తున్న రేషన్ సగం నుండి మూడోవంతువరకుతగ్గించేశారనివార్త. దానివల్ల కూలీలలో విపరీతమైన ఆందోళన బయలుదేరింది. ఖమ్మం తాలూకా ఆంధ్ర మహాసభ కార్యదర్శి శ్రీ చిర్రావూరి లక్ష్మీనరసయ్యగారి యాజమాన్యాన కూలీలు సబ్ కలక్టరు దగ్గరకు ఆకలియాత్ర బయలు దేరారు. కులమత విచక్షణ లేకుండా స్త్రీలూ పురుషులూ, మొత్తం 800 మంది ఈ యాత్రలో పాల్గొన్నారు. "ఆహారకమిటీలను స్థాపించాలి; హిందూ ముస్లిం లేకమై ఆహార సమస్యను పరిష్కరించాలి" అని నినాదాలిస్తూ వెళ్ళారు.

చవుకంగళ్ళను హెచ్చుచేయాలనీ, వాటిలో నుంచి బియ్యం ఇప్పించాలనీ, ప్రతి కుటుంబంలోను ఉన్న సభ్యుల లెక్కలనుబట్టి బియ్యం సప్లయి చేయాలనీ, చవుకడిపోలకు సప్లయి ఆగిపోకుండా చూడాలనీ, రూపాయికి 4¼ శేర్లు కాకుండా మునుపటిలాగానే రూపాయికి బియ్యం 5 శేర్లు, జొన్నలు 9 శేర్లు యిప్పించాలనీ, కోరారు. ఆకలి మంటలతో మాడిపోతున్న ప్రజల కోర్కెలను సబ్‌కలెక్టరు పెడచెవిని పెట్టాడు. ఎంతో ఒత్తిడితెస్తే రేషన్ సగంకన్నా ఎక్కువ తగ్గించకుండా చేయడానికి, ధనికులకు రేషన్‌కార్డు లివ్వడం మాని, బీదప్రజలకే ఇచ్చేలా చేయడానికి అతనంగీకరించాడు.

తమ కోర్కెలను అధికారి నెరవేర్చనందుకు ప్రజలు నిరుత్సాహపడకూడదు. కులమత విచక్షణలేకుండా, హిందూ ముస్లింలందరూ ఏకమై ఆహార కమిటీని ఏర్పరచుకోవాలి. ప్రతి కుటుంబానికి ఎంత బియ్యం అవసరమో లెక్కలు తీయాలి. వాలంటీరుదళాన్నేర్పాటు చేయాలి. ఈవిధంగా నిర్మాణయుక్తంగా, సంఘటితశక్తితో కృషిచేస్తే అధికారులు లొంగిరాకతప్పదు-ప్రజల యిబ్బందులు తొలగిపోగలవు.

తూర్పుగోదావరిజిల్లా గొల్లప్రోలులో ప్రజలకు, ముఖ్యంగాకూలీలకు బియ్యందొరకడం చాల కష్టంగా ఉంది. ఈ కష్టాన్ని నివారించుకోవడానికి ఈమధ్య 200 మంది కూలీలు, పేద రైతులు, పిఠాపురానికి ఆకలియాత్ర బయలుదేరారు. డిప్యూటీ కలెక్టరక్కడ మకాంవేసి ఉన్నాడు. ఆకలియాత్ర నాయకులు, కూలీ, రైతుసంఘాల తరఫున, గ్రామప్రజల తరఫున 400 సంతకాలతో ఒకమహజరు కలెక్టరుగారి కిచ్చారు. గ్రామానికి సరిపడే ధాన్యం సప్లయిచేయమనీ, చౌకధరల డిపో పెట్టమనీ కోరారు. వీటికోసం తనశక్తి కొలది ప్రయత్నిస్తానని కలెక్టరు చెప్పాడు.

కర్నూలు పట్టణంలో ఆహార సమస్య భీషణరూపం దాల్చింది. ఆనగరంలో కావలసినన్ని స్టోర్సులు, అంగళ్ళు, డిపోలు వున్నా ప్రజలకి సరిపోయేబియ్యంమాత్రంలేదు. ఈ డిపోలదగ్గర ప్రజల తొక్కిసలాట చెప్పతరం కాకుండా ఉంది. దీనిని సర్దడానికి ఇంతవరకు అధికారులు పోలీసు సిబ్బందిమీదనే ఆధారపడుతున్నారు.

ఈ పరిస్థితులను చక్కబరచ డానికి కమ్యూనిస్టులు కృషిచేస్తున్నారు, ఆహార కమిటీని ఏర్పాటుచేయడానికి, సరిపడినంత బియ్యంతెప్పించి రేషన్‌పద్ధతిలో పంచడానికి, పోలీసు జబర్దస్తీ తొలగించడానికి ప్రజల్లో ప్రచారంచేస్తున్నారు; మహజర్లపై సంతకాలు పెట్టిస్తున్నారు.

వీరికృషి ఫలించే సూచనలు కనబడుతున్నాయి. ఈనెల 7 వ తేదీని హనుమాన్ స్టోర్సువద్ద పనిచేయడానికి జిల్లా కమ్యూనిస్టు పార్టీ ఆర్గనైజరు కోనేరు రాజగోపాలరావు, స్థానిక కామ్రేడ్స్ జమ్మన్న, తిప్పారెడ్డి వెళ్ళారు. అక్కడ సుమారు 1000 మంది ప్రజలు తొక్కిస లాడుతున్నారు. దీనిని సహించలేక కొట్టుగుమాస్తా బియ్యంఇవ్వడం మానివేశాడు. పోలీసు జబర్దస్తీ ప్రారంభమయింది. మన కామ్రేడ్స్‌వెళ్ళి కొద్ది ప్రయాసతో స్త్రీలను, పురుషుల్ని సర్ది కూర్చోబెట్టారు. అందరూ బారులుతీరి కూర్చొని శాంతంగా ఉంటే అందరికీ బియ్యం దొరుకుతాయని రాజగోపాలరావు వాళ్లకు నచ్చజెప్పాడు. కామ్రేడ్సు కృషిజూచి ఒక నలభై ఏండ్ల ముసలాయన ముందుకువచ్చి శాంతంగా ప్రజల్ని సర్దడం ప్రారంభించాడు. మరో ఇద్దరు వర్తకులు కూడ అతనికి సాయం వచ్చారు. వాళ్లముగ్గురు, కామ్రేడ్సు ముగ్గురు కలసి చక్కగా పనిచేసి అందరికీ బియ్యం అందించారు. ఏలాంటి అక్రమాలు జరక్కుండా, స్త్రీలకేలాంటి ఇబ్బంది లేకుండా చూచారు. ఈ కృషిలో పోలీసులుకూడా మన కామ్రేడ్సు చెప్పినట్లు పనిచేశారు. ఇది ఆనగరంలో కొత్త అనుభవం. ఆహారకమిటీ నేర్పాటు చేయడానికి, ప్రజావాలంటీరు దళాన్నేర్పాటుచేయడానికి అవకాశా లేర్పడ్డాయి.

కిరసనాయిల్ కరువు

బెజవాడతాలూకా పటమట గ్రామంలో 675 కుటుంబాలకు 16 డబ్బాలే సప్లయి అవుతూంది. కుటుంబానికి ⅓ కాయకన్నా ఎక్కువ అందడంలేదు. సప్లయి చేయండని కోరితే అధికారులు అవకతవకలతో కాలయాపన చేస్తున్నారు. ఈలోగా చాలినంత కిరసనాయిల్ లేక రైతులు, విద్యార్థులు చాల అవస్థపడుతున్నారు. అధికారులు వెంటనే ప్రజల అవసరాలను గుర్తించి సప్లయి హెచ్చుచేయాలి.

ఆకలిలోకం

★

నిలువుదోపిడిచేసి - కలలుకంటున్నారు
ప్రళయమారుతమింక - బయలుదేరాలిరా!
కటికయాకటిచిచ్చు
చెలరేగి
కళ్ళుతెరిపించెరా!!

ఎన్నదెగయునికఅవు - వెన్నుమీధనుబరువై
కన్నబిడ్డలతిండి - కడుపునింపగదోచి
గడపుచెన్నాళ్ళురా!
సోదరా!
కన్‌దెలచిచూడరా!!

తినదిండికఱువాయె - కొనుగోలుబరువాయె
అధికారమధికమ్ము - సహకారమల్పమ్ము
స్వార్థలాభాలకై
ఆహారమది
దోయబడుతున్నదోయ్!

ఆకొన్నలోకాలు - నైక్కొట్టుతున్నాయి
ఏకాకులై వారు - యీనాడులేరోయి
కదలివస్తున్నారురా!
సోదరా!
బ్రదుకుతెరువేచూడరా!!

దారిద్ర్యపీడితులమై - దాస్యంపుతాడితులమై
జాతిహానినిగూర్చు - సంకుచితమార్గాల
పడినల్గిపోరాదురా!
స్వాతంత్ర్యమార్గాన
వడినడచిపోవాలిరా!!

చావుబ్రదుకులదేల్చు - సమరమిది, దారిద్ర్య
బాధితులహృదయాన - ప్రబలెఐక్యతావాంఛ
కోటిచేతులులేచెరా!
సోదరా!
ఎదురుండబోదురా!!

నార్ల చిరంజీవి.

కరువు క్యాంపులలో....

బళ్ళారిజిల్లాయందలి బాపురం కరువు నివారణ క్యాంపులో కూలీలు రోజూ క్వారీలలో గరుసు(గులకరాళ్ళతో గట్టిపడిన నేల) త్రవ్వి తీసుకొచ్చి రోడ్డుపనులకు ఉపయోగిస్తారు. నేలకు అడుగుభాగంలో సొరంగం తవ్వితే, పైనున్న గరుసు అమక్కి పడిపోతుంది. అప్పుడు దాన్ని కూలీలు సులభంగా తవ్వి, తీసుకొస్తారు. 12—8—43 వ తేదీని కూలీలు యీవిధంగా సొరంగాలు తవ్వుతూంటే, పైనున్న మట్టి అకస్మాత్తుగా విరిగి పడుటవల్ల 13 ఏండ్ల బాలిక ఒకతె ప్రాణం విడిచింది. ఇద్దరు స్త్రీలకు కాళ్ళు విరిగినవి. ముగ్గురు ఆడవాళ్ళకు, ఒక మగవానికి బలమైన దెబ్బలు తగిలినవి. వీరికి చికిత్సచేయుటకు ఫామిన్ డాక్టరు కూడా లేనందున ఉదయం 9 గంటలనుండి సాయంత్రం 6 గంటల వరకూ వారి కెట్టి చికిత్స లేదు. డాక్టరు ఎప్పుడూ క్యాంపులో ఉండడని తెలిసింది. అచ్చటవున్న కాంపౌండరు వట్టి గుడ్డ చుట్టి బండ్లలో 8 మైళ్ళదూరంలోవున్న ఆలూరుకి తీసుకువెళ్ళినారు.

ఇక కోల్ కార్లు, మేస్త్రీలు చేయు అన్యాయాలు ఇన్నీ—అన్నీ కాదు. ఛార్జీ ఆఫీసరు మారినప్పుడు వీ డ్కోలు ఖర్చులకుగాను కూలీల కూలిలో కోత; మేస్త్రీల గడియారాలకు కోత; కోల్కారుల అప్పులు తీర్చడానికి కోత. నేమకల్లు క్యాంపులో కంట్రాక్టర్ల ఎద్దులు కిచెన్లలో వండిన అన్నం తింటున్నాయి. రేషన్ పదార్థములుకూడా వంటచేయుటలో మిగిలించుకోవడం జరుగుతున్నది.

యెర్రగుడి— చింతకుంట మధ్యన కాలువ తవ్వే కూలీల పరిస్థితి మరీ దారుణం. కరువుతో చస్తూవున్న రైతులకు యీకాలువ చాలా అవసరం. ఒక్కొక్కకూలి 7 గజముల వెడల్పు, 1½ గజము పొడవు, 1 అడుగు లోతు, రాయి- గరుసు తోగి (తవ్వి), ఆ మన్నును 7 గజాల దూరంలో వెయ్యాలి. తోగే గుద్దిలి కూడా కూలీలే తెచ్చుకోవాలి. ఇంతకష్టం పడుతూన్నా, వారికి యిచ్చుకూలి, పురుషులకు 3 చటాకుల (సేరులో 16 వ వంతు ఒకచటాకు), సద్దలు, 0-0-9డబ్బులు. స్త్రీలకు- పిల్లలకు కొద్ది తక్కువగా గింజలు, 0-0-6 డబ్బులు, యిస్తున్నారు. కూలీలు సాయంత్రం 6 గం. వరకు పనిచేసి, 10 లేక 15 మైళ్ళ వరకూ కూడ నడిచి, వారివారి గ్రామాల కెళ్ళాలి. ఈకారణాలవల్ల కాలువ తోగు కూలీల సంఖ్య తగ్గిపోతూంది. ఇందువల్ల శాశ్వత కరువు నివారణకై యేర్పరచిన కాలువ పని నిలిచిపోయి, ఆహారోత్పత్తికి పెద్ద ఆటంకము కలుగబోతుంది.

ఈప్రాంతంలో యింతవరకువానలు లేనందున, పత్తిన కొర్ర- వేరుసెనగ- జొన్న పైరులు ఎండిపోవుచున్నవి. ముందు పంటకు వచ్చే ఆశలేదు. రైతులదగ్గర ధాన్యంలేదు. పశువులకు మేతలులేక, రైతులు పాడి పశువులను, వ్యవసాయానికి పనికివచ్చే పశువులను అమ్ముకుంటున్నారు.

ప్రభుత్వంవారు వెంటనే యీక్రింది పనులకు పూనుకోవాలి :

1. మేస్త్రీల, కోల్కారుల అక్రమచర్యల నరికట్టాలి.

2. కూలీలకు కూలి ఎక్కువచేయాలి.

3. చనిపోయిన బాలిక కుటుంబానికి, గాయాలుతగిలినవారికి ధనసహాయంచేయాలి.

4. వంటశాలలో యిండెంటును తనిఖీ చేస్తూ, రేషన్ పదార్థాలు వంటపాత్రలో వేయువరకు చూడ్డానికి స్థానిక ప్రజాసంస్థల సహకారం పొందాలి.

5. కాలువపని త్వరగా ముగియుటకు కూలీ లందరినీ అచ్చటికే మరల్చి పని చేయించాలి

6. ధాన్యపు ధరలను ప్రజల కందుబాటులో ఉండేటట్లు కంట్రోలుచేసి అమ్మించాలి.

7. బీదరైతులకు వడ్డీ లేకుండా అప్పులివ్వాలి.

8. రైతుల పశువులకు మేతను చౌక ధరలకు సప్లయిచేయాలి.

— పురిసెట్ల వెంకటరామప్ప.
(ఆంధ్రరాష్ట్ర రైతుసంఘ కార్యనిర్వాహక సభ్యుడు)

★

మేస్త్రీలు, కోల్కారులు తొలగించబడ్డారు

అనంతపురం జిల్లాయందలి చాబాల కరువు నివారణ క్యాంపులో మేస్త్రీలు, కోల్కారులు చేసే అక్రమాలను గురించి బుశెట్టి వన్నప్పశెట్టి (జిల్లా కరువు నివారణ కమిటీ ఉపాధ్యక్షులు), డాక్టర్ రాజగోపాల్, టి. రాములు, సందా నారాయణప్ప, టి. వెంకటేశ్వరరావు గారలు 1000 మంది కూలీలను సబ్ డివిజనల్ ఆఫీసరువద్దకు తీసుకెళ్ళి, కూలీలకు జరిగే అన్యాయాలను గురించి వివరాలతో తెలియజేయగా, సదరుమేస్త్రీలు- కోల్కారులు పనులనుండి తొలగించబడ్డారు. అప్పటినుండి ఆ 1000 మంది కూలీలకు సరిగా కూలి ముడుతోంది.

★

అధికోత్పత్తికి ఆటంకాలు

దేశంలో ఆహారసమస్య దోపిళ్ళను - అరాజకాన్నీ ప్రోత్సహిస్తూన్నప్పటికీ, జమీందార్లు, స్థానికోద్యోగులు పంటల అధికోత్పత్తి విషయంలో ఉపేక్షవహించడమే గాక, అనేక ఆటంకాలు కల్పిస్తున్నారు.

ప్రభుత్వం తనస్వాధీనంలోనున్న బంజరు భూముల్ని సాగుచేసే నిమిత్తం ఉచితంగా యిస్తామని ప్రకటనచేస్తే, విజయనగరం ఎస్టేటులో వేలంపాటలు పాడుతున్నారు. 11-8-43 వ తేదీని ఎస్టేటు కలక్టరు కొత్తవలస బంగాళాలో కొన్ని సాగులేని బంజరు భూములను వేలంవేశారు. ఒక పేదరైతు 7 యకరాల విస్తీర్ణంగల భూమిని పాడాలని ముందుకొచ్చాడు. కాని, ఆవూరులోని ఒక షాహుకారు రైతుపై పోటీచేసి, యకరం 1 కి 100 రూపాయలు నజరానా చొప్పున పాట పాడేడు. గత్యంతరం లేక, రైతు పాటను విడిచిపెట్టవలని వచ్చింది అనేక ప్రయాసల కోర్చి, ఆహారపదార్థాలను అందజేసే రైతుమీద డబ్బుగల షాహుకారు పోటీచేస్తూంటే, ఎస్టేటు కలక్టరు చూస్తూఊరుకోవడం పంటల అధికోత్పత్తిని ప్రోత్సహించడంకాదు. వ్యవసాయంచేసే పేద రైతులకు - కూలీలకు మాత్రమే యిచ్చునట్లు చూడాలి.

నీటిపన్నువల్ల పల్లపుసాగుకు అంతరాయం

తూర్పుగోదావరిజిల్లా గొల్లప్రోలు "బి" ఎస్టేటులో అసలే భూములకు యకరం 1 కి రు. 20, 30 వరకు అధిక శిస్తులు వసూలు చేయబడుతున్నాయి. మెరకభూములలో పల్లపు సాగుచేస్తే, యకరం 1 కి రు. 5 చొప్పున నీటిపన్ను చెల్లించాలని గతమాసంలో ఎస్టేటు అధికార్లు ఉత్తరువు చేశారు. ఈ భూములకు వర్షాధారంతప్ప యితరనీటి సదుపాయాలేవీ జమీందారు చేయించలేదు. అందువల్ల, అధిక శిస్తులతోబాటు యీ నీటి తీరువా చెల్లించలేక, కొందరు రైతులు పల్లపుసాగుకు ప్రయత్నాలు వదలుకొంటున్నారు. రైతుల తరఫున కామ్రేడ్స్ భావనాచారి, కొప్పుల వెంకట్రావు 29-7-43 న ఒకసారి, 14-8-43 న మరొకసారి, డిప్యూటీకలెక్టరు వద్దకు రాయబారం వెళ్ళి, నీటి తీరువాను రద్దుచేయించవలసిందని కోరారు. 8-8-43 న కూడా ఎస్టేటు జమీందారు వద్దకు పోయి రైతుల కష్టాలను తెలియజేశారు.

గంపలగూడెం ఎస్టేటులో

ఈ ఎస్టేటులో చింతలపాడు చెరువుకు ఒక ఏటి వర్వ ఉంది. మొదట ఉన్న నీటితో భూమి చాలవరకు సాగయింది. కాని, జమీందారు తనకున్న 30 ఎకరముల సొంతభూమిని సాగుచేయుటకు ముంపులేకుండుటకు గాను నీటిని వెళ్ళగొట్టి, తన భూమిని సాగుచేసుకున్నాడు. అందువల్ల వెలితట్టుభూమి అంతా ఎండిపోతూంది. ఇంతేగాక, రైతులు తమ సొంతభూమిలో చెరువులు పోసుకొని సాగుచేసుకొంటే, య 1 కి రు. 6 చొప్పున శిస్తు యివ్వమని నిర్బంధిస్తున్నాడు. 15 సంవత్సరాలుగా సాగు అవుతూన్న భూములకు, 30 సం.గా సాగుఅయేపట్టా ఈనాములకు, నజరానా రు. 20, నీటి తీరువ రు. 10, చొప్పున యిచ్చునట్లు ఈయేడు నిర్బంధించుచున్నారు.

గంపలగూడెం, కొత్తపల్లి, తిరువూరు జమీందార్లు అడవులలో మేతమేసే పశువులకు పుల్లరిరేట్లను ఈయేడు కొత్తగా హెచ్చించారు. కట్టెబండ్లకు, కంప బండ్లకు, కూడా రేట్లు రెట్టింపు చేశారు. ఇట్టి చర్యలను ప్రభుత్వోద్యోగులు అరికట్టి, ఆహారోత్పత్తికి సహాయం చేయవలసియుంది.

గోదావరి నీటిని నిల్వచేయాలి.

పశ్చిమగోదావరిజిల్లా రైతుసంఘంతరఫున అధ్యక్ష, కార్యదర్శులు యీక్రిందివిధంగా ప్రకటిస్తున్నారు : గోదావరి నీటి పంపకంలో ఇంజనీరింగ్ శాఖవారు వర్షపాతమును బట్టి, గోదావరి నీటినిబట్టి నీటిపంపకపు లెక్కలను తయారుచేసి యున్నారు. సాగులు జూన్ 15 లగాయతుఆగస్టుమాసాంతంవరకుజరుగునను అంచనాపై జూన్ 15 తరువాత సాగుఅయే భూములనుతరగతులవారీగా విభజించియున్నారు. కాని, వర్షం కురియకపోతే, వీరిలెక్కలు, అంచనాలు, తలక్రిందులౌతాయి. ఈయేడు ఊడ్పులు అయినప్పటినుంచి సరియైనవర్షాలు లేక, ఊడ్చిన చేలకు నీరు లేక, కొన్నింటికి తెగుళ్లుపట్టి, నష్టం కలుగుతోంది. ఇక నూతనంగా సాగుచేసిన బంజరు భూములకు నీటి బోదులులేక, మురుగుసౌకర్యాలులేక, కొన్ని చవిటిపర్ర లగుటచేత, ఎండిపోతున్నాయి. దీని కంతకూ ప్రధానకారణం, గోదావరినీటిని తగినంతగా నిలవచేయకపోవుట, ఇసుకమేటలను తీయించకపోవుట. అందువల్ల ఉభయగోదావరి జిల్లాల రైతులు యీసమస్యపై దృష్టిని కేంద్రీకరించి ప్రభుత్వంపై బలమైన ఒత్తిడి తీసుకురావలసిందని హెచ్చరిస్తున్నాం.

ప్రజా ఐక్యతకు అడ్డేది?

అధికాహారోత్పత్తికై ప్రభుత్వం చేసిన ప్రకటసను పురస్కరించుకొని, చల్లపల్లి వ్యవసాయ కూలీలు సంవత్సరంక్రితం లక్ష్మీపురం గ్రామంలోని బంజరుభూమి సాగుకుగాను గట్లు పెట్టినందుకు చల్లపల్లి జమీందారు వ్యవసాయ కూలీలను దౌర్జన్యాలకు గురిచేసి, వారిపై కేసులు బనాయించిన విషయం పాఠకులకు తెలిసే ఉంది. దీనిని గూర్చి తాలూకారైతుసంఘం బాధ్యత తీసుకొని, డిఫెన్సు నడిపింది. కూలీల ఐక్యతను విచ్ఛిన్నంచేయడానికి జమీందారు అనేక ఎత్తులు వేసి, చివరకు విఫలుడయాడు. అవనిగడ్డ సబ్ మేజస్ట్రీటుకోర్టులో గతమాసం, కేసుకు ఎట్టి ఆధారం లేకపోవడంవల్ల, కొట్టివేయబడింది.

గ్రామైక్యతకు కృషి

మంగళాపురంలో కమ్యూనిస్టు, యువజన, విద్యార్థి, రైతు, సంఘ సభ్యులు గ్రామస్థుల నిత్యసమస్యలతో దగ్గరసంబంధం పెట్టుకొని పనిచేస్తున్నారు. 1 నెలరోజులు సర్వే నేర్చుకొని, రైతుల పొలాలను కొలిచిపెట్టి, తగాదాలు లేకుండా చూస్తున్నారు. ఇప్పటికి సుమారు 180 యకరం సర్వే చేసిపెట్టారు. ఈకృషిని రైతులెంతో మెచ్చుకొని, ఎకరం 1 కి 0—8—0 చొప్పున రు. 40—0—0 విరాళమిచ్చారు. నోట్లు, దస్తావేజులు, కౌళ్ళు, ఖత్తు, వగయిరా వ్యవహారిక విషయాలలో తర్ఫీదుపొంది, గ్రామస్థుల ఐక్యతనుపెంపొందించడానికి యువకులు ఉత్సాహంతో ముందుకొస్తున్నారు. మంగళాపురం, భోగిరెడ్డిపల్లె గ్రామాలలో యీమధ్య కలరా వ్యాపించినప్పుడు యువకులు కలరా నివారణకు రాత్రింబగళ్ళు పనిచేశారు.

గ్రామ మునసబుపై చర్య

తూర్పుగోదావరిజిల్లా పిఠాపురం డివిజనుకు చెందిన కుతుకుడుమిల్లి, వాకతిప్ప మునసబు లిద్దరు పైఅధికార్ల ఉత్తరువుకు వ్యతిరేకంగా 27—7—43 వ తేదీకి అనంతరం ప్రజలవద్ద యుద్ధ చందాలు వసూలుచేస్తూ వచ్చారు. గ్రామస్థులు కలిసివెళ్ళి తమ డబ్బు తమకు తిరిగి యిచ్చివేయవలసిందని ఒత్తిడి చేయగా, వారు లక్ష్యంచేయలేదు. చివరకు, ఉన్నతోద్యోగస్థులు కొత్తపల్లి గ్రామంలో మకాంవేసినప్పుడు వీరిద్దరిపై ఫిర్యాదుచేశారు. కేసు విచారణ జరిగి, ఎవరి సొమ్ము వారికిప్పించివేసి, పై మునసబు లిద్దరినీ తమ ఛార్జీని కొత్తపల్లి మునసబుకు ఒప్పగించవలసిందని ఉత్తరువు జారీ చేశారు.

అధికోత్పత్తికి అప్పులు

భీమవరం తాలూకా (పశ్చిమగోదావరి జిల్లా)లో కొన్ని గ్రామాలలో ఎరువులసప్లయి సరిగా జరుగక, పంటకు నష్టంవస్తోంది. బొండాడ గ్రామరైతులు పశ్చిమగోదావరిజిల్లా రైతుసంఘ కార్యదర్శి కృత్తివెంటి వెంకటేశ్వరరావుగారి నాయకత్వంకింద భీమవరం అగ్రికల్చరల్ డిమాన్ స్ట్రేటరు వద్దకు రాయబారం వెళ్ళి, అప్పులిచ్చి ఎరువులను సప్లయి చేయవలసిందని కోరారు. వెంటనే ఆయన ఉత్సాహంతో 3 రోజుల వ్యవధిలో, 400 రూపాయల ఎరువులను అప్పుగా 9 గురురైతులకు సప్లయి చేశారు.

'సెప్టెంబరుడే' జరపండి!


ఆంధ్రరాష్ట్ర రైతుసంఘ ప్రధాన కార్యదర్శి నండూరి ప్రసాదరావుగారు యీ క్రింది విజ్ఞప్తి చేస్తున్నారు :

కార్మికులకు 'మేడే' ఎంతప్రధానమైనదో, రైతులకు 'సెప్టెంబరుడే' (సెప్టెంబరు 1 వ తేదీ) అంత ప్రధానమైనది. ఆరోజున రైతులు -వ్యవసాయకూలీలు గ్రామగ్రామాన ఐక్యతతో అఖిలభారత, ఆంధ్రరాష్ట్ర రైతుసంఘాలిచ్చిన కార్యక్రమాన్ని అమలులో పెట్టుటకు ప్రతిజ్ఞ తీసుకుంటారు.

మన దేశంలో యేర్పడిన రాజకీయ ప్రతిష్ఠంభనను అంతమొందించడానికి గాంధీజీ మొదలైన కాంగ్రెసు నాయకుల విడుదలకు, విధ్వంసక చర్యల నరికట్టి పంచమాంగదళాన్ని నాశనం చేయుటకు, కాంగ్రెసు-లీగ్ ఐక్యతను సాధించుటకు, ఇందుకు వివిధ ప్రజాసంస్థల సహకారాన్ని పొందుటకు, రైతుసంఘాలు విశాలమైనఐక్యతనేర్పరచాలి.

ఆహార సంక్షోభాన్ని పరిష్కరించుటకు కూడా రైతులు- రైతుసంఘాలు ముందుకు రావాలి. రైతులు ఎక్కువ ధరలకాసించి పెచ్చు ధాన్యాన్ని సహితం నిలవజేసుకోవడం అంటే అర్థం, కరువుతో చస్తూన్న రాయలసీమ ప్రజలకు సహాయంచేయ నిరాకరించడమన్నమాట. ప్రభుత్వం, వివిధ ప్రజాసంస్థలు, కరువు నివారణకు చేస్తూన్న ప్రయత్నాలన్నింటినీ భగ్నం చేయడమన్నమాట. రైతులకు- కూలీలకు మధ్య, పట్టణాలకు- పల్లెలకు మధ్య అంతర్యుద్ధాలకు అవకాశమిచ్చి, జపాన్ ఏజంట్లను బలపరచడమన్నమాట. కాబట్టి, వచ్చేపంట వరకు ప్రతి గ్రామానికి కావలసిన ధాన్యాన్ని మిగుల్చుకొని, మిగతావి కరువు ప్రాంతాలకు, ప్రజల కందుబాటులో ఉండే ధరలకు, అమ్ముతామని రైతులు ప్రతిజ్ఞతీసుకోవాలి. ఆహారసమస్యను పరిష్కరించుటకై జమీందార్ల - షాహుకార్ల, ప్రభుత్వోద్యోగుల, సహకారం పొందాలి.

అధికాహారోత్పత్తికి రైతులుజమీందార్లకు తగిన హామీలనిచ్చియైనా, జమీందారీ బంజర్లను సాగుచేయడానికి ముందుకురావాలి. జలాధారములనురమ్మతుకై ఆందోళనచేస్తూ, వీలైనచోట్ల రైతులు స్వయంగా మరమ్మతు చేసుకోవాలి. (ఉదాహరణకి : ఇందుపల్లి, సోమవరప్పాడు.) దీర్ఘకాలపు పంటలస్థానే తక్కువ కాలపు పంటలను పండించాలి. పొగాకు, నీలి మొదలైన వ్యాపార పంటలకు బదులు ఆహారపంటలు వేయాలి. కృష్ణ ఆనకట్ట తలుపులను పెంచుటకూ, గోదావరి యిసుక మేటలను తవ్వించుటకు, ఆందోళన చేయాలి.



కామ్రేడ్ నండూరి ప్రసాదరావు.

రైతు- కూలీలమధ్య సామరస్యం పెంపొందుటకు వ్యవసాయకూలీ సంఘాల కనీసపు కోర్కెలను రైతులందరూ అంగీకరించునట్లు చేయాలి.

రైతుసంఘ సభ్యత్వాన్ని మనరాష్ట్రంలో 1½ లక్షవరకూ పెంచి, ప్రతిగ్రామంలోను పనిచేసే గ్రామరైతుసంఘాలను నిర్మించాలి.

రాయలసీమ రైతులకు — కూలీలకు ధనసహాయం, ధాన్యసహాయం, బట్టలసహాయం చేయాలి. విరాళాలు ఆంధ్రరాష్ట్ర రైతుసంఘ కార్యాలయం, బెజవాడకు పంపాలి.

పై కార్యక్రమంకొరకు ఆందోళనచేస్తూ సెప్టెంబరు 1 వ తేదీని గ్రామ గ్రామాన సభలు, ఊరేగింపులు జరపాలి;

అరెస్టులు

ది 13—8—43 సాయంత్రము 4 గంటలకు అమలాపురం తాలూకా రైతుసంఘ ఆర్గనైజరు నామిశెట్టి పార్థసారథిగారిని పోలీసులు అమలాపురం గ్రామములో అరెస్టుచేసి అంబాజీపేట తీసుకొనివచ్చిరి. కొన్నికార్డులు, పుస్తకములు తీసుకొనివెళ్ళారు. ఆఫీసు సోదాచేశారు.

నరసారావుపేటలో

అంతకు రెండు రోజులక్రితమే జనరల్ బాడీ మీటింగు జరిగింది. జిల్లాకమిటీ కాండిడేట్ సభ్యుడు వెనిగళ్ళ రామకృష్ణయ్య వినుకొండకు బయల్దేరాడు. అగస్టు 9 వ తేదీన శాంతిని కాపాడవలసిన అవసరాన్ని ప్రచారం చేయటానికి ఉత్సాహంగా బయల్దేరారు. తాలూకా కమిటీ సెక్రటరీ కామ్రేడ్ నరసింగరావు, కామ్రేడ్స్ రామకృష్ణయ్య, శ్రీగిరిరాజు సత్యనారాయణ, సుబ్రహ్మణ్యం, బ్రహ్మానందం, పార్వతి, హనుమాయమ్మగార్లను 8 వ తేదీని పోలీసులు అరెస్టుచేశారు. కామ్రేడ్స్ పార్వతి, హనుమాయమ్మగార్లను బెయిలుమీద విడుదలచేశారు.

దేశభక్తుల విజ్ఞప్తి

అగస్టు 9 సందర్భంలో దేశభక్త కొండా వెంకటప్పయ్య గారిచ్చిన విజ్ఞప్తిలో ఈక్రింద ఉదహరింపబడిన భాగాన్ని బలపరుస్తూ గుంటూరు కాంగ్రెసు వాదులైన శ్రీ సోము శ్రీరాములు, కనక్కాయల అంకమ్మ, దేచిరాజు సాంబశివసదా వరప్రసాదరావు, శిష్టా వెంకటకృష్ణయ్యగారలు ప్రకటనచేశారు

" ఈనాటి అగమ్యగోచర పరిస్థితులలో కొందరు కాంగ్రెసు పేరట అధికారాన్ని చలాయించచూస్తున్నారు. కాంగ్రెసు తరఫున ఒక కేంద్రకమిటీ రహస్యంగా పనిసాగిస్తున్నదని ప్రజలు అపోహపడుతున్నారు. కాని యదార్థంగా అలాంటి కమిటీ ఏమిలేదు. ఏదైనా ఉంటే అది శాస్త్రీయమైన కమిటీ గాదు. కాంగ్రెసుపేరుతో వ్యవహరించుటకు దానికి అర్హతలేదు. అందుచే ప్రజలు ఈలాంటి బూటకకమిటీల ప్రాబల్యంలో పడకుండా ఉండాలి. గాంధీ, కాంగ్రెసు నాయకులపై మోపిన నేరారోపణలను బలపర్చుకొనుటకు ప్రభుత్వానికి సాకునిచ్చే చర్యలను ప్రజలెవ్వరు చేయరాదని మా మనవి."

బాలసంఘాల నిర్మాణం

అప్పారావు పేట:—(పశ్చిమగోదావరి) పి. సోమన్నగారి అధ్యక్షతను బాలసంఘ సమావేశం జరిగింది. 25 గురు సభ్యులను చేర్పించారు. యం. వెంకట్రావును అధ్యక్షునిగాను, యం. సరోజినిని కార్యదర్శినిగాను ఎన్నుకొన్నారు.

కోరుమామిడి :— (పశ్చిమ గోదావరి) కామ్రేడ్ బుల్లిరాజు అధ్యక్షతను 11-8-43 వ తేదీని బాలబాలికల సమావేశం జరిగింది. వేములపల్లి ఆదినారాయణమ్మను అధ్యక్షురాలుగను, ల. కసాని సత్యనారాయణను కార్యదర్శిగను ఎన్నుకున్నారు.

పోతునూరు :— 12—8—43 వ తేదీన బాలసంఘ సమావేశం జరిగింది. సుమారు 60 మంది వచ్చారు. కోడూరి గోపాలకృష్ణమూర్తిని అధ్యక్షునిగాను, కామిరెడ్డి భాస్కరరావును కార్యదర్శిగాను ఎన్నుకొన్నారు.

బెజవాడ :— 15-8-43 రాత్రి మ్యునిసిపల్ వర్కర్సు బాలసంఘం "గెరిల్లా" నాటకం, వేశారు. విచిత్ర వేషాలువేసి, కోయ- గెరిల్లా- బ్రహ్మంగారితత్వం- అన్నాచెల్లెలు- స్త్రీల పాటలుపాడారు. ఈ ప్రదర్శనానికి 600 మంది వచ్చారు. ఫాసిస్టు వ్యతిరేక భావాలతో, ఆహారసమస్య పరిష్కారం కావాలనే భావాలతో, ప్రజలు వెళ్లిపోయారు. హార్మనీ- తబలా వాయించిన వారికి మ్యునిసిపల్ వర్కర్సు యూనియన్ తరఫున వెండి సుత్తీ- కొడవలి ఇచ్చారు. అన్నా- చెల్లెలి పాటపాడుతూ రు. 1-8-10 పార్టీకి వసూలు చేశారు.

వేమండ :— 15-8-43 న బాలసంఘ సమావేశానికి 30 మంది హాజరయ్యారు. కేతినేని నాగేశ్వరరావుగారధ్యక్షత వహించారు. బాలసంఘ అధ్యక్షునిగా దుక్కిపాటి వెంకటరత్నంను, కార్యదర్శిగా దుక్కిపాటి కోటీశ్వరరావును ఎన్నుకున్నారు. రాయలసీమకు 4 కుంచాలు ప్రోగుచేశారు.

తాడంకి :— 15-8-43 న తాడంకి బాలసంఘ సమావేశం జరిగింది. 35 గురు సభ్యులతో బాలసంఘం ఏర్పడింది. విడుదల నాగేశ్వరరావును అధ్యక్షునిగాను, జక్కా భాస్కరరావును కార్యదర్శిగాను ఎన్నుకున్నారు.

జమీదింటకుర్రు:— 12—8—43 వ తేదీన జమీదింటకుర్రు గ్రామ బాలసంఘం; శాస్త్రి పున్నయ్యగారి అధ్యక్షతను సమావేశమైంది. సూరపనేని తాతారావును అధ్యక్షునిగాను, వెంట్రప్రగడ వీరయ్యను కార్యదర్శిగాను ఎన్నుకొన్నారు.

నాగాయితిప్ప :— 16—8—43 వ తేదీన కామ్రేడ్ కొత్తపల్లి వెంకటేశ్వరరావు అధ్యక్షతను బాలసంఘ సమావేశం జరిగింది. 20 మంది హాజరయ్యారు. యార్లగడ్డ శివరామకృష్ణప్రసాద్ ను అధ్యక్షునిగాను, కంఠంనేని శివరామకృష్ణను కార్యదర్శిగాను ఎన్నుకొన్నారు.

అమృతలూరు:— (గుంటూరు) గోపీచంద్ అనే ఆరేండ్లబాలుడు వచ్చీ రాని పాటలతో ఇంటింటికీ తిరిగి, చందా యిచ్చేదాకా కదలకుండా రాయలసీమ నిధికి రు. 1—5—0, 2 చొక్కాలు వసూలుచేశాడు.

★

బాలసంఘం

[గోపాలుడే—వేణుగోపాలుడే అనుమాదిరి]

బాలులారా ఓబాలికలారా
బయలుదేరెన్ మన బాలసంఘము ॥బా॥
రండి మీరు - జండాచేబూని
పాడుదము - పాటపాడుదము
ఆడుదము ఆటలాడుదము ॥బా॥
స్నానముచేదాం - చక్కగవుందాం
చదువుకొందాం - బాగచదువుకొందాం
కథలువిందాం - వీరగాథలువిందాం ॥బా॥
వీరులమౌదాం - ధీరులమౌదాం
మనదేనోయి - ఈదేశము
మనమేనోయి - పాలింతాము ॥బా॥

— కామ్రేడ్ "కరణం"

మహిళాసంఘ ప్రచారం

15—8—43 వ తేదీన భారత మహిళా మండలి క్లబ్బులో మానికొండ బుల్లెమ్మగారి అధ్యక్షతనుగవర్నరుపేట(బెజవాడ)మహిళా సంఘ సాధారణసభ్యుల సమావేశం జరిగింది. గవర్నరుపేట మహిళాసంఘ బ్రాంచి యేర్పడింది. కామ్రేడ్ కె. మాణిక్యాంబ, స్త్రీ స్వాతంత్ర్యం, ఆస్థిహక్కులు, ఆర్థిక హక్కులనుగురించి మాట్లాడారు.

కామ్రేడ్ సుబ్బమ్మ కరువు బాధ, కార్మిక స్త్రీల దరిద్రం,దుస్థితి, వ్యాధులకు గురియగుటనుగురించి మాట్లాడారు. వీటిని పరిష్కరించుకోడానికి మహిళా సంఘంలో చేరాలని విజ్ఞప్తిచేశారు.

స్త్రీలు కార్యదీక్షవహించి, మహిళాసంఘాలలో ఉత్సాహంగా పనిచేయాలని బుల్లెమ్మగారు హెచ్చరించారు. సభలో యీక్రిందితీర్మానాలు గ్రావించారు : "1. ఇపుడున్న నాల్గు సెంటర్లలో గాక మరి నాలుగు సెంటర్లలో ప్రసూతి వైద్యశాలలు యేర్పాటు చేయాలి, 2. ఎక్కువ సంఖ్యగల కార్మిక పేటలలో మరుగుదొడ్లు కట్టించాలని పురపాలకసంఘం వారిని కోరుతున్నాము, 3. కొనుగోలువస్తువులన్నిటికి రేషనింగు పెట్టాలి."

ఇందుపల్లి :— (గన్నవరం తాలూకా) ఇందుపల్లిగ్రామ మహిళాసంఘంలో కొత్తగా చేరిన 26 గురితో మొత్తం 180 మంది సభ్యత్వంవుంది. గ్రామ మహిళాసంఘంవారు 5 కేంద్రాలలో పుస్తక అధ్యయనం, పాటలు, బుర్రకథ నేర్పుతున్నారు. ప్రతిదినం ఈ కేంద్రాలకు 75 మంది హాజరవుతున్నారు. కూరగాయలు ఎక్కువగా పండించాలని ప్రచారం చేయబడుతోంది. తేలప్రోలులో 26 వ తేదీన జరిగే తాలూకా మహిళాకాన్ఫరెన్సుకు రు. 18-5-0, 4 కుంచాల బియ్యం విరాళం వసూలుచేశారు. ఒక పేద మంగలి స్త్రీ, 100 పిడకలు ఇచ్చింది.

నందమూరు - వేమండ (గన్నవరం తాలూకా) పైగ్రామాలలో మహిళాసంఘాలను మానికొండ బుల్లెమ్మ, మాగంటి లక్ష్మీకాంతమ్మ గారలు ఏర్పరిచారు.

నందమూరులో, పాలడుగు త్రిపురసుందరి గారిని అధ్యక్షురాలుగను, శిరిపురపు సంపూర్ణమ్మగారిని కార్యదర్శినిగను ఎన్నుకొన్నారు.

వేమండలో కేతినేని నాగరత్నమ్మగారిని అధ్యక్షురాలుగను, కేతినేని సరస్వతమ్మగారిని కార్యదర్శినిగాను ఎన్నుకొన్నారు.

నవుదూరు : (పశ్చిమగోదావరి) నవుదూరు మహిళాసంఘంవారు మరుగుదొడ్లకై పంచాయితీబోర్డుకు సంతకాలతో మహజర్లు పెట్టించారు.

కార్మిక సమస్యలు

బందరులో ఆంధ్ర సైంటిఫిక్ కంపెనీ ఉంది. అందులో ముఖ్యమయిన రసాయన పదార్థాలు, ఫ్యాక్టరీ పనిముట్లు ఉత్పత్తి అవుతున్నాయి. పనివారి స్థితి దుర్భరమౌతూంది. వాళ్ళకు తగిన కరువు భత్యం లేదు. ఉన్న కొద్దిహక్కుల్ని కూడా అధికారులు భంగపరుస్తున్నారు. ఈ యిబ్బందులను తీర్చుకోవాలన్నా, ఉత్పత్తిని అధికంచేయాలన్నా, సంఘం పెట్టుకోవడం అత్యవసర మని కార్మికులు నిశ్చయించుకున్నారు. ఇది తెలిసి, యజమానులు మరింత విరుచుకుపడుతూ, పనివాళ్లను బెదరించి సంఘం పెట్టుకోనీయకుండా చేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఇలాంటిప్రవర్తన ఈరోజుల్లో దేశద్రోహకరమని యజమానులు గుర్తించాలి. కార్మికుల సంఘశక్తియొక్క సహకారంతో ఉత్పత్తిని వృద్ధి చేయడమే నేడు తమ కర్తవ్యమని యజమానులు గుర్తించాలి.

రాజమండ్రి ముఠాకూలీలు

రాజమండ్రి ముఠాకూలీల సంఘంవారు, షాహుకార్లు కలిసి, బుట్టలనుప్యాక్‌చేసి కాటా మీద వేయడానికివ్వవలసిన రేట్లనునిర్ణయించుకున్నారు. ఇప్పుడు నాలుగు కొట్ల షాహుకార్లీ నిర్ణయానికి వ్యతిరేకంగా ప్రవర్తిస్తున్నారు. అంతేకాకుండా జూలై 31 వ తేదీని 54 మంది కూలీలను అకారణంగా తీసివేశారు. బండ్లవాళ్ళచేత నిర్బంధంగా బండ్లు కట్టించుకోడానిక్కూడా ప్రయత్నిస్తున్నారు. కార్మికులను భయపెట్టి యూనియన్ని రద్దు చేయడానికి కుట్రలు పన్నుతున్నారు. ఈ ప్రయత్నాల్లో పోలీసుల సహాయంతీసుకోడానిక్కూడా ప్రయత్నిస్తున్నారు. ఈ ప్రయత్నాలకు లెచ్చిపోకుండా కార్మికులు సంఘటితశక్తితో షాహుకార్ల కుతంత్రాల నెదుర్కోవాలి.

చేనేత పారిశ్రామికులు

బట్టలకరువు ప్రజల్ని నానాబాధలు పెడుతున్న ఈ రోజుల్లో చేనేతపరిశ్రమ ఎంతో ప్రధానమయినది. ఈనెల 7 వ తేదీని బందరు, కప్పలవొడ్డి చేనేత పారిశ్రామికుల వర్కింగుకమిటీ సభ జరిగింది. నూలుధర విపరీతంగా పెరిగిన ఈరోజుల్లో ఈ పారిశ్రామికులకు పొట్టగడుపుకోడానికి ఏమీ మిగలటంలేదని ఈ సభ ఒక ప్రకటన చేసింది. దీనివల్ల అనేక మగ్గాలు పనిలేకుండా పడి ఉంటున్నాయి. వెంటనే ప్రభుత్వం నూలుధరను కంట్రోలుచేసి చేనేతపరిశ్రమ వల్ల ఉత్పత్తి అధికంఅయేలా చేయాలని కోరారు.

ఈనెల 14 వ తేదీని బందరు ఇనగుదురుపేట చేనేత పారిశ్రామికులు సమావేశమై బందరులో కో-ఆపరేటివ్ సొసైటీని స్థాపించుటకు కృషిచేయాలనీ; ప్రభుత్వాధికారులు మగ్గానికి ఒక గాలన్ చొప్పున కిరసనాయిల్ సప్లయి చేయాలనీ; తీర్మానించారు.

★

జిల్లా విద్యార్థి మహాసభ

పామర్రులో 28, 29 తేదీలలో జరుగబోవు6వకృష్ణాజిల్లా విద్యార్థిమహాసభకు వాలంటీరు (ప్రజారక్షణదళ) ప్రదర్శనము జరుపబడును. కనుక ప్రతి స్థానిక సంఘము వారు మహాసభకు వచ్చునప్పుడు బాడ్జీలు, ఖుతర సామాగ్రి వారే తీసుకొని రావలయును. జండాలు మొదలైనవి ప్రతిస్థానిక సంఘము తప్పకతీసికొని రావలయును.

ఇట్లు,
కాట్రగడ్డ వెంకటప్పయ్య,
జిల్లావిద్యార్థిసంఘ కార్యదర్శి

★

రాయలసీమ కరువునిధి

5-8-43 నుండి 18-8-43 వరకు జమాఖర్చులు

జమ

క్రిందటిసారి ప్రకటించిన జమలు	7012- 7-8
పశ్చిమగోదావరిజిల్లారైతుసంఘం	143 -0-0
దివితాలూకా రైతుమహాసభలో వసూళ్ళు	75- 6-0
చినఓగిరాల రైతుసంఘం	29- 1-3
మిట్టగూడెం రైతుసంఘం	3- 0-0
నూతులవారిపాలెం గ్రామరైతుసంఘం	13- 0-0
దుగ్గిరాల రైతుసంఘం	52- 0-0
విశాఖపట్నం మహిళాసంఘం	3- 5-0
బెజవాడ తాలూకా రైతుసంఘం	17-12-9
చినఓగిరాల వ్యవసాయకూలీసంఘం	8- 0-0
అతుకూరు మహిళా సంఘం	6-10-0
కృష్ణాజిల్లా మహిళాసంఘం	7- 6-0
దుగ్గిరాల మహిళాసంఘం	10- 0-0
చినకళ్ళేపల్లి మహిళాసంఘం	5- 0-0
కాజ యువజనసంఘం	10-14-0
రమణక్కపేట బాలసంఘం	4- 4-0
అయిదుగుళ్ళపాలెం బాలసంఘం	3-14-0
సీతన్నపేట బాలసంఘం	2- 0-0
కొణిచర్ల బాలసంఘం	9- 0-0
భీమునిపట్నం	18- 0-0
వేంపాడుబాలసంఘం	5- 1-0
మాల్కాపురం	22- 0-0
చీపురుపల్లి	11- 0-0
పెదపూడి	1- 0-0
పసలపూడి	16- 0-0
కొత్తపేట	5- 0-0
రాజమండ్రి	0-13-0
గొందిపాలెం	10- 0-0
అకివీడు	8-15-0
నిడమర్రు	6- 0-0
తాడేపల్లిగూడెం	6- 6-0
అప్పారావుపేట	16- 0-0
గోపవరం	78- 0-0
రావులపాడు	4- 8-0
చినకళ్ళేపల్లి	10- 0-0
వీరవల్లి	5- 0-0
అవనిగడ్డ	20- 0-0
కాజగ్రామం	2- 8-0
ఒంగోలుతాలూకా వల్లూరు	2- 4-0
స్టాన్లీహాస్పిటల్(మదరాసు)రోగులు	2- 0-0
గుంటూరుజిల్లా కల్చరల్‌దళం	27- 2-0
బెజవాడ టౌన్‌కమ్యూనిస్టు కమిటీ	2- 4-0
వాలంటీరుకుపంపినది వాపసు	20- 0-0
మొత్తం జమలు.	7655-13-8

ఖర్చు

క్రిందటిసారి ప్రకటించిన ఖర్చులు	5596-12-6
బళ్ళారిజిల్లా ముగ్గురు వాలంటీర్లకు	82- 2-0
హలాహర్విలోని యిద్దరు వాలంటీర్లకు	60-12-0
అనంతపురంజిల్లా యిద్దరు కొత్త వాలంటీర్లకు	40- 0-0
వాలంటీర్లకు పుస్తకాలకు	2- 6-0
ఒకవాలంటీరుకు బెజవాడలో	1- 0-0
మణియార్డరు ఖర్చులు	0-10-0
మొత్తం ఖర్చులు	5783-10-6
నేటి నిల్వ	1689- 7-2
రూ.	7473- 1 8

ఇంకా దివితాలూకా మాలెంపాటి శారదగారు ఒకబంగారపు గాజు యిచ్చారు. కృష్ణా, పశ్చిమగోదావరిజిల్లాలనుండి సుమారు 2000 కాల్తీలు బట్టలు వచ్చాయి.

బెజవాడ. 18-8-43.

ఇట్లు,
చెరుకూరి చలపతిరావు
ఆఫీసు మానేజరు
ఆంధ్రరాష్ట్ర రైతుసంఘం.

చుండూరు వెంకటరెడ్డి ఫౌండ్రీ పరిస్థితులు

కార్మికుల యూనియన్‌మీద పగసాధించడంకోసం చుండూరు వెంకటరెడ్డి (బెజవాడ) తన ఫౌండ్రీ పనివాళ్లమీద దండయాత్ర ప్రారంభించి వందమందికి జీవనాధారం లేకుండా చేశాడు. కరువురోజుల్లో ఈవంద మంది కుటుంబాలు పడేపాట్లు వేరే చెప్పనక్కర్లేదు. అంతే కాకుండా ఈ ఫౌండ్రీలో ఉత్పత్తికి అంతరాయం కలగడంవల్ల ధాన్యం. చమురు, ఫ్యాక్టరీలకు; బస్సుల రాకపోకలకు చాల యిబ్బంది కలుగుతుంది. ఈ కారణం వల్ల, సోదర కార్మికులు అనుభవిస్తున్న బాధలుచూచి, ఇతరసంస్థల కార్మికుల్లో ఆందోళన పెరుగుతూంది. దేశరక్షణ గుర్తించి కార్మికులు రెచ్చిపోకుండా, సక్రమమార్గంలో ఈ ఫౌండ్రీ సమస్యను పరిష్కరించుకోడానికి కృషిచేస్తున్నారు.

ఆంధ్రదేశంలో అన్ని ట్రేడ్‌యూనియన్లు ఈనెల 16 వ తేదీన ఫౌండ్రీ పనివాళ్ళపట్ల సానుభూతిదినంగా ఎంచి సభలు జరిపాయి. కార్మికవర్గ సంఘీభావానికిదొక అమోఘ నిదర్శనం. ప్రభుత్వం వెంటనే జోక్యం కలుగజేసుకొని ఈ ఫౌండ్రీ సమస్యను పరిష్కరించి శాంతిని కాపాడి, దేశరక్షణ కార్యక్రమానికి తోడ్పడాలని కోరుతూ అన్ని ప్రాంతాలనుంచి ప్రభుత్వానికి తీర్మానాలు వెళ్ళాయి. ఈసమస్యయొక్క ప్రాముఖ్యాన్ని గుర్తించి ఇతర ప్రజాసంస్థలుకూడా దీని పరిష్కారంకోసం ఆందోళన జరుపుతున్నాయి. ఆంధ్రరాష్ట్ర కిసానసభ ఈ సందర్భంలో ప్రభుత్వానికొక తంతివార్తను, మెమోరాండాన్ని పంపింది. కృష్ణాజిల్లా యువజనసంఘం ప్రభుత్వం వెంటనే తగిన చర్యతీసుకోవాలని తీర్మానించింది. 9176 మంది బెజవాడపౌరుల సంతకాలతో ప్రభుత్వ ప్రధానకార్యదర్శి కొక మహజరువెళ్లింది.

ప్రజలు, ప్రజాసంస్థలు, వివిధ కార్మిక సంస్థలు కలిసి రు. 308—0—3 లు విరాళాలు పోగుచేసి కార్మికులకు సహాయం చేస్తున్నారు. ఈ డబ్బును పెద్దవాళ్ళకు రోజుకి 0—8—0, చిన్నవాళ్ళకు 0—4—0 చొప్పున పంచుతున్నారు.

ఈవిధంగా ప్రజలు, ఇతర కార్మికవర్గం ఈనాడు ఎందు కిలా ఫౌండరీ కార్మికవర్గానికి అండగా నిలుస్తున్నారు? ప్రస్తుత పరిస్థితుల్లో చుండూరు రెడ్డి ఫౌండరీ ఉత్పత్తి విచ్ఛిన్నమవడం అంటే ప్రజల సౌకర్యాలకు అత్యవసరమయిన సరుకుల ఉత్పత్తి ఆగిపోవడం అన్నమాట. ఇప్పటి యిబ్బందులు యింకా ఎక్కువయి, అశాంతి హెచ్చే అవకాశాలేర్పడడమన్నమాట. పంచమాంగదళానికి ఒక తలుపు తెరవడమన్నమాట. చుండూరు రెడ్డి, ఈ ప్రమాదాన్ని లక్ష్యపెట్టకుండా రామేశ్వరానికి తీర్థయాత్ర వెళ్ళాడు.

కాని, కార్మికులు ప్రభుత్వంపై ఒత్తిడి హెచ్చిస్తున్నారు. కార్మికులతరపున కామ్రేడ్ సి. వి. కె. రావుగారు మద్రాసు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని, లేబరు కమీషనరుని కలుసుకొని యీవిషయం చర్చించి, అడ్జుడికేటరును నియమించమని కోరారు. త్వరలోనే ఒక నిర్ణయం ఇవ్వదలచినట్లు వారుచెప్పారు. కార్మిక ప్రతినిధులు స్థానిక తహశీల్దారుకి రెడ్డి చేసిన పనులను గురించి, యూనియన్ కృషిని గురించి, స్టేట్‌మెంటుయిచ్చారు.

ఈలోగా ఫౌండరీ అధికారులు కార్మికుల ఐక్యతను భంగపరచడానికి కుతంత్రాలు పన్నుతున్నారు. కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంకింద నిలచి, కార్మికు లీకుతంత్రాలకు బలికాకుండాఐక్యతతోముందుకుపోతున్నారు.

ప్రజాశక్తి చందావివరాలు

సంవత్సర చందా	5—0—0
అర్థ సంవత్సర చందా	2—8—0
పావు సంవత్సర చందా	1—4—0

ఏజంట్లకు

1. ప్రతినెలా మొదటివారంలోగా, క్రిందటి నెల బిల్లు పూర్తిగా చెల్లించకపోతే పత్రిక పంపబడదు.

2. పత్రికలు ఎక్కువ కావలసివచ్చినా, తగ్గించవలసి వచ్చినా ఒక వారం రోజులు ముందుగా తెలియజేయాలి. లేనిచో మార్పు చేయడం అసంభవం.

చందాదార్లకు

1. అడ్రసులు స్పష్టంగా వ్రాయాలి.

2. అడ్రసులు మార్చేయెడల, చందా నెంబరు, పాతఅడ్రసు, కొత్తఅడ్రసు, వివరంగా వ్రాయాలి.

3. పాత చందాదార్లు చందాలను తిరిగి కట్టేటప్పుడు తమ చందా నెంబరు తెలియజేయాలి, లేదా కనీసం తాము ఇదివరలో చందాదారుగా వున్నామనే సంగతి వ్రాయాలి.

4. ఏ వారమైనా పత్రికలు అందనిచో వెంటనే తెలియజేయాలి. రెండుమూడు వారాలో, నెల రోజులో పోయినతరువాత మాకు ఇన్నిరోజుల నుంచి అందడంలేదని వ్రాస్తే పొరపాటు ఎక్కడవున్నదీ తెలుసుకోవడం కష్టం. కంప్లెయింటు వ్రాసేటప్పుడు చందానెంబరు, అడ్రసు వివరంగా వ్రాయాలి.

అడ్రసు మీదనున్న చందా అయిపోయే తేదీని చూచుకొని, ఆతేదీలోపలే మరల చందాలుకట్ట ప్రార్థన.

— మేనేజరు,

యుద్ధ సమీక్ష

■ ఆంగ్లో-అమెరికన్-సోవియట్ సమావేశం జరపాలి
■ చైనాలో చీలికలా?

ఖార్కోవ్, బ్రియాన్స్క ప్రదేశాల రెండింటిలోనూ, నాజీలు కొత్తకొత్త సైన్యాలను తెచ్చి మొండిగా ప్రతిఘటిస్తున్నారు. అన్నివిధాలా చొరవగల్గిన రెడ్ ఆర్మీ యీప్రతిఘటనను చావగొడుతోంది.

ఖార్కోవ్—ఇజ్యూం రైల్వేలైను తెగగొట్టబడింది. ఖార్కోవ్—క్రిమియారైలును రెడ్ ఆర్మీ సమీపిస్తోంది. ఖార్కోవ్‌కు వాయువ్యంగా 85 మైళ్ళలో వున్న 'లెబెడిన్'ను వశం చేసుకొంది. ఇందువల్ల'సూమీ'ని ప్రక్కగాదాటి పట్టుకొనే ఆవకాశం రెడ్‌ఆర్మీకి, కలిగింది. జర్మన్లు కొత్తకొత్తదళాలను తీసుకువచ్చి తీవ్ర ప్రతిఘటన సాగించుతున్నా, రష్యన్ల పురోగమనం ఆగదు.

రెడ్‌ఆర్మీ నేడు కొట్టే దెబ్బలకు హిట్లరు తాళుకోలేడనడానికి, జులై 15-ఆగస్టు 20 ల మధ్య జర్మనీ పొందిన నష్టాలే నిదర్శనం.

రెడ్‌అర్మీ

నాశనంచేసినవి		పట్టుకొన్నవి	
విమానాలు	4600	టాంకులు	857
టాంకులు	6400	ఫిరంగులు	1274
ఫిరంగులు	38,000	మెషిన్‌గన్స్	3429
లారీలు	20,000	లారీలు	4230

చంపబడినజర్మన్లు 3లక్షలు. ఖైదీలు 25,6000 గాయపడిన జర్మన్లు 7 లక్షలు

ఇతరరంగాలలోకూడ హిట్లరు దెబ్బతింటూనే వున్నాడు. సిసిలీ ఆక్రమణను మిత్రరాజ్యాలు పూర్తిచేశాయి. లిపారి, స్ట్రాంబోలీ అనే దీవులు (ఇటలీకి పశ్చిమంగాఉన్నవి) కూడ మిత్రరాజ్యాలచేతిలో పడ్డవి. ఇటలీ దక్షిణకొనలోని రెజీరేవుపట్టణాన్ని జర్మన్లు నాశిచేశారు. రోమును అరక్షిత ప్రదేశంగా ఇటలీ ప్రకటించింది.

ఇటలీలో రాజకీయ సంక్షోభం తీవ్రమవుతూనేఉంది. ఇటాలియను సోషలిస్టులు, శాంతిని, పౌరహక్కులనూ కోరడమేగాక "ఫాసిజానికి, యుద్ధానికి కారణభూతమైన రాజరికవాదాన్ని" కూలద్రోయాలంటున్నారు. అంటే రాజూ, బడోగ్లియోముఠా పోవాలని అర్థం. ముఖ్య నగరాలలో ఇటాలియను కార్మికులు సమ్మెచేస్తున్నారు.

ఈనాడే బడోగ్లియోను, హిట్లరు పెత్తనాన్ని కూలద్రోయగల్గినంత శక్తి ఇటలీ ప్రజా ఉద్యమానికిలేనిమాట నిజమే, కాని దానికి ఎన్నాళ్ళో పట్టదు. ఇటలీపై దండయాత్ర సత్వరమైనకొద్దీ, ప్రజాఉద్యమం కూడ హెచ్చి ఫాసిస్టుల పతనంజరుగుతుంది.

అందుచే, మిత్రరాజ్యాల దండయాత్ర ఆలస్యమైనకొద్దీ, హిట్లరుకే మిలిటరీ సన్నాహాలకు వ్యవధిచిక్కుతూంది. ఉత్తర ఇటలీలో జర్మనీ సైన్యాలను దింపాడు.

ఒక్క ఇటలీలోనేగాక ఫ్రాంసుపైకూడ దెబ్బతీసి, 80 జర్మను డివిజన్లకుపనిగల్పించి, హిట్లరు పతనాన్ని త్వరితం చేయమని, మాస్కో పదే పదే హెచ్చరించింది. అలా చేస్తే విజయం 1943 లోనే లభించుతుంది. ప్రజల రక్తం, ప్రాణాలు చాలవరకు రక్షించబడుతాయి. అట్టి నిర్ణయం ఏదో తీసుకొంటుందని క్విబెక్, కాన్ఫరెన్సువంక ప్రపంచం అంతా చూస్తోంది. కాని క్విబెక్‌కు సోవియటు పిలువబడలేదు. ఎందువల్ల? బ్రిటన్ అమెరికాలు రెండవరంగం విషయమై ఊగులాడుతున్నాయి. సాధ్యమైనంత ఆలస్యంచేయాలని చూస్తున్నాయి. సోవియటు విజయాలు, ఇటాలియన్ పరిస్థితులు, రెండవరంగం ఇదివరకుకంటె కూడ తక్షణ సమస్యగా అయేటట్లు చేశాయి. మిత్రనాయకుల సంభాషణలలో సోవియటు పాల్గొంటే రెండవరంగాన్ని గురించి వెనుదీయడానికి అవకాశం ఉండదు. అందుకనే ఆహ్వానించకపోడానికి కారణం.

అంతేగాని, జపానుకూ, సోవియటుకూ ఒడంబడిక ఉన్నందువల్ల, జపానుపై వేసే ప్లానులలో సోవియటు పాల్గొన వీలులేదంటూ కొందరు విలేఖరులు చెప్పే కల్లిబొల్లి కబుర్లకు అర్థంలేదు.

రెండవరంగం అంటే వీరికి భయందేనికి? రెండవరంగం తెరిస్తే, ఫాసిస్టు ప్రతికూల ప్రజాశక్తులు విజృంభిస్తాయి. దానిని వీరు కోరడంలేదు. ప్రజావిప్లవం లేకుండానే, జర్మనీలోను, జర్మను ఆక్రమిత దేశాలలోను మార్పులు తేవాలని, బ్రిటను అమెరికాల ఉద్దేశ్యం. ఇలాంటి కోర్కెలు, అనవసర విలంబనానికి దారితీస్తున్నాయి. హిట్లరు బలపడటానికి, ప్రజలు, మరింత త్యాగం, చేసి, మరింత రక్తం ధారపోసి, బాధపడటానికి కారణమవుతుంది.

సోవియట్ 1942 అక్టోబరులోనే "శత్రువును సంపూర్ణంగా ఓడించడానికి ఆక్రమిత ప్రజల మహోజ్వల పోరాటం, ఒక ముఖ్యమైన పాత్ర వహించుతుంది." అని చెప్పింది. కనుక ఫ్రాంసు, ఇటలీలలో రెండవరంగం తెరిస్తే, పైన చెప్పిన ఆక్రమిత ప్రజాశక్తుల అండ, హిట్లరుకు సమాధి తవ్వడంలో సహాయపడుతాయి. ఇప్పటికే సోవియట్ విజయాలు, మిత్రరాజ్య విజయాలు, నాజీ ఆక్రమిత ప్రజలనుత్సాహపరుస్తున్నాయి. నార్వేలో హిట్లరు బానిసలక్రింది ఉద్యోగులు సైతం తిరగబడటమే నిదర్శనం. జర్మనీకి నిర్బంధంగా పనిచేయమంటే, నార్వీజియన్ యువతులు నిరాకరించారు. వారిపై చర్యగైకొన నిరాకరించినందుకు పోలీసు శాఖాధ్యక్షుణ్ణే జర్మన్లు కాల్చారు. ఇంతేకాదు, జర్మన్ బానిసదేశాల పరిపాలకుల గుండెనిబ్బరం సన్నగిలుతోంది. "న్యాయమైన శాంతి"కోసం, హంగేరీ మతాధిపతులు ప్రార్థనలు సల్పారు. ఫిన్లండు ఎపుడు బయటపడదామా అని తహతహలాడుతోంది. హిట్లరు డెన్మార్కులో మార్షల్‌లాను ప్రవేశపెట్టవలసివచ్చింది.

కామ్రేడ్ తుమ్మల వెంకటరామయ్య

"వార్ అండ్ వర్కింగుక్లాసు" (యుద్ధం, కార్మికవర్గం) అనుసోవియట్ పత్రిక కోరుతున్నట్లు, ఇప్పటికైనా "ఆంగ్లో—సోవియట్—అమెరికన్ కాన్ఫరెన్సును జరపాలి. దాని ముఖ్యఆశయం యుద్ధం త్వరలో ముగించడం, 1943 లోనే విజయం పొందడం."

చర్చిల్‌సతి, రష్యాను అభినందించుతూ ఒక ప్రసంగం జరిపింది. ఇప్పుడు మాటలతో పనిలేదు. కావలసిందిపని. క్విబెక్ చర్చల నిర్ణయాలింకా బయటికి రాలేదు. కాని మిత్రరాజ్యాల ధోరణిమాత్రం ఏమీ బాగాలేదు. "వార్ అండ్ వర్కింగుక్లాసు" మరొకసందర్భంలో చెప్పినట్లు, "డీగాలీ-జీరో"ల ఫ్రెంచి ఐక్యకమిటీని సోవియటు ఎట్టి షరతు లేకుండా గుర్తించుతున్నా, బ్రిటన్- అమెరికాలు సంశయిస్తున్నాయి. ఫ్రెంచి వలసదేశాల అధిపతులుగా మాత్రం వీరిని బ్రిటను - అమెరికాలు గుర్తించుతాయిగాని, ఫ్రాన్సుదేశ విషయంలో గుర్తించరని ఒకవార్త వచ్చింది. దీనిఅర్థం, ఫ్రాంసులో ఏదోరకమైన 'డార్లాన్' మళ్లీ దొరకడాఅని ఎదురుచూడడమే. శామ్యూల్‌హోరు ఫ్రాంకో చుట్టూ తిరగడం, ఇంకా మ్యూనిక్ వాసనలు పూర్తిగా పోలేదనే తెలియజేస్తోంది. ఈ ధోరణులన్నిటినీ కూలద్రోసే ప్రజా ఆందోళన నానాటికీ హెచ్చుతూనేవుంది.

ఇక ప్రాచ్యరంగంలో కూడా మిత్రరాజ్యాలకు మంచివిజయాలే లభించాయి. కిస్కాదీవి (ఉత్తర పసిఫిక్) వశమయింది. వెల్లాలావెల్లీకూడా వశమయింది. వేవాక్‌లో నేలమీదనున్న 148 జపాను విమానాలను నాశనంచేసి, మరి 50 ని నష్ట పరచారు మిత్రరాజ్య వైమానికులు. హిట్లరు పతనం తన పతనానికి కూడా దారితీస్తుందని జపానుకు తెలుసు. రేపో - మాపో మిత్రరాజ్య దండయాత్ర తనపై తప్పదని కూడా తెలుసు. కాని ఉన్న అవకాశాన్ని జపాను బాగా ఉపయోగించుకొంటుంది.

బర్మాను "స్వతంత్రదేశం" అని ప్రకటించి దానిచే మిత్రరాజ్యాలపై "యుద్ధం" ప్రకటింపజేసింది. ఇది చులాగ్గా త్రోసివేయవలసిన విషయిం కాదు. అట్లాంటిక్ చార్టరును బర్మాకు వర్తింపజేసి, బర్మాప్రజలను స్నేహితులుగా చేసికోడమే బ్రిటనుకర్తవ్యం. రూజువెల్టు ఫిలిప్పైనుకిచ్చినలాంటి వాగ్దానం అవసరం. లేనిదే బర్మా ప్రజల బ్రిటిషు ప్రతికూల భావాలు నశించవు. వారు జపాను పన్నాగంలో పడకుండా ఉండాలంటే, ఇదేమార్గం. ఒక్క బర్మాకే గాక, పసిఫిక్ దేశాలన్నిటికీ, ఇండియాకు స్వాతంత్ర్యం ప్రకటించిననాడే, జపానుపై ప్రజల అండతో గూడిన దెబ్బను మిత్రరాజ్యాలు తీయగలవు.

చైనాలోకూడ, జపాను, సంధి వదంతులు పుట్టించింది. ఆసంధిషరతులేమిటి? తమ కీలుబొమ్మయగువాంగ్-చంగ్‌వీనివదలివేయడం. ఉత్తర చైనా జపాను పలుకుబడి ప్రదేశంగా ఉండటం. జపాను దక్షిణ మధ్య చైనాలను వదలి వేయడం. షాంగే, కాంటన్, హోనాన్‌లలో విమానాశ్రయాలను, సైనిక నివాసస్థలాలను, జపానును ఉంచుకోనీయడం. ఈసూచనల అర్థం ఏమిటి? చైనాను మిత్రరాజ్యాల నుండి విడదీయాలని, చైనాలో కమ్యూనిస్టులు నివసించే ఉత్తరచైనాను, జాతీయ చైనాయగు దక్షిణ చైనాతో విడదీసి వేయాలని, జపానుఎత్తు, దానికి జంగ్-కే-షేక్ అంగీకరించకపోవచ్చు. కాని చైనాలో ఇంకా జపాను అనుకూలురున్నారు. వాళ్ళు జపానుతోకన్న కమ్యూనిస్టులతో పోరాడటం ముఖ్యమని తలుస్తారు. చుంకింగ్ ప్రభుత్వంలో వీరికి పలుకుబడితక్కువ. అయినా వారివల్ల ముప్పు లేకపోలేదు. "వార్ అండ్ వర్కింగుక్లాస్" అను పత్రిక, కమ్యూనిస్టు సైన్యాలపై జాతీయ సైన్యాలు దండెత్తినట్లు వ్రాసింది. దీనిఅర్థం, కమ్యూనిస్టులుండే షెన్సీ-కాన్సు-నింగ్‌సియా సరిహద్దులలోని కమ్యూనిస్టులపై, జపాను అనుకూల చైనాసైన్యాధిపతి ఎవడో దండెత్తాడన్నమాట.

ఉత్తరచైనాలో 14½ జపాను డివిజన్లను ప్రతిఘటించుతూ, చైనాలోని 100 కి 44 మంది జపాను సైనికులను ఉత్తరప్రాంతానికి అంటిపెట్టుకొనేటట్లు కమ్యూనిస్టు సైన్యాలు చేశాయి. నిజంగా, కమ్యూనిస్టు - జాతీయ సైన్యాల ఐక్యతయే జపాను అధిక యంత్ర బలాన్ని ఇన్నాళ్ళు ఆపగల్గింది. కాబట్టి సోవియటు పత్రిక, "వార్ అండ్ వర్కింగ్‌క్లాస్" హెచ్చరించినట్లు, "చైనాలో అంతర్యుద్ధ ప్రమాదం రానీయగూడదు. కమ్యూనిస్టు సైన్యాలపై దండెత్తితే అంతర్యుద్ధం తప్పదు. చైనాప్రభుత్వంలో ప్రజా వ్యతిరేక శక్తులకు పైచేయి ఉండరాదు. అంతర్యుద్ధం, చైనా స్వాతంత్ర్యయుద్ధానికి వినాశకర ఫలితాలను తెస్తుంది." కాబట్టి జంగ్—కై—షేక్ ఇట్టి వారిని సత్వరం తొలగించి చైనా ఐక్యత కాపాడాలి.

23-8-43

(2 వ పేజీ తరువాయి) జరిగినప్పుడు ప్రత్యేక సదుపాయాలేమీ చేయబడవు. ఇట్టిస్కీము ఇతర పట్టణాలన్నింట్లోను, తరుగు ప్రాంతాలన్నింట్లోనుకూడా, ప్రవేశపెట్టడం అవసరం. దీనివల్ల తిండిదొంగల పీడ చాలావరకు తొలగుతుంది. కరువు దోపిళ్ళకు అవకాశం అంతగా ఉండదు. అయితే, ప్రజాసంస్థల సహకారం లేకపోతే, ఎంత చక్కని స్కీము అయినా కాగితంమీదే ఉండిపోతుందనే విషయాన్ని ప్రభుత్వం గ్రహించవలసియుంది.

బ్రిటిష్—అమెరికన్ ప్రజల ఆందోళన

దేశంలో యీవిధంగా నానాటికి విషమించుతూన్న ఆహారసంక్షోభం ప్రపంచ ఫాసిస్టు వ్యతిరేక సంఘటనను యెలా బలహీనపరుస్తూందో బ్రిటిష్-అమెరికన్‌ప్రజలుగ్రహించి, యిందుకు మూలకారణమైన రాజకీయ ప్రతిష్టంభనను తొలగించడానికి తీవ్రంగా ఆందోళనచేస్తున్నారు. ఆగస్టు 9 వ తేదీని నిర్బంధ విధాన స్మారకదినంగా లండన్‌లో అనేక చోట్ల బహిరంగసభలు జరిగాయి. ఇండియా లీగ్, భారతస్వాతంత్ర్య సంఘం, స్వరాజ్య భవనం, హిందుస్తానీ సోషల్ క్లబ్, మొదలయిన సంస్థలు జరిపిన సభ లన్నింట్లోను బ్రిటిష్ ప్రముఖులు కాంగ్రెసు నాయకుల్ని విడుదలచేసి జాతీయప్రభుత్వస్థాపనకై కృషి చేయవలసిందని బ్రిటిష్‌ప్రభుత్వాన్ని హెచ్చరిస్తూ ఉపన్యాసాలిచ్చారు. 100 మంది పార్లమెంటు సభ్యులు కలిసి, అట్లాంటిక్‌ఛార్టర్‌ను ప్రపంచప్రజ లందరికీ వర్తింపజేస్తూ ప్రభుత్వం ఒక ప్రకటన చేయవలసిందని కోరుతూ పార్లమెంటులో తీర్మానం ప్రతిపాదించదలచుకున్నారు. గ్లాస్గో హెరాల్డ్, న్యూస్‌క్రానికల్, బర్మింగ్‌హాంగెజెట్, మాంచెస్టర్ గార్డియన్ మొదలయిన బ్రిటిష్‌పత్రికలు బ్రిటిష్‌ప్రభుత్వ పాలసీని కఠినంగా విమర్శిస్తూ వ్యాసాలు వ్రాశాయి.

ఇలాగే అమెరికాలో కూడా వాషింగ్టన్, న్యూయార్కు మొదలయిన ప్రధాన నగరాలన్నింట్లోను ఆగస్టు 9 వ తేదీని భారతీయుల జాతీయవాంఛను బలపరుస్తూ ఊరేగింపులు, బహిరంగసభలు జరిగాయి. ఇప్పుడు క్విబెక్‌లో బ్రిటిష్ ప్రధానితో సంప్రదింపులు సాగిస్తూన్న రూజ్‌వెల్టు అధ్యక్షునికి లూయీ ఫిషర్, పెర్ల్‌బక్ మొదలయిన విఖ్యాత అమెరికన్ రచయితలు జాబు వ్రాస్తూ, భారతదేశ సమస్యను చర్చించి పరిష్కరించవలసిందని హెచ్చరించారు. అమెరికన్ పాలకవర్గం భారతదేశ రాజకీయ సమస్యలలో జోక్యం కలిగించుకొనక నిరాకరిస్తూన్నట్లుతెలుస్తూన్నా, అట్లాంటిక్‌ఛార్టర్ ప్రపంచ ప్రజ లందరికీ వర్తించుతుందనీ, జపాన్‌ను పూర్తిగా ఓడించగానే ఫిలిప్పైన్ ప్రజలు సంపూర్ణ స్వాతంత్ర్యం స్థాపించుకోవచ్చు ననీ, రూజ్‌వెల్టు చేసిన ప్రకటన మిత్రరాజ్య ప్రజలందరి ఆశయంతో ఏకీభవించుతోంది.

మన కర్తవ్యం

బ్రిటిష్ - అమెరికన్ ప్రజలు ఈవిధంగా మన జాతీయ వాంఛను గురించి పట్టుదలతో ఆందోళనచేస్తూంటే, ఇటు మన దేశంలోకూడా వివిధ రాజకీయ పార్టీలు తమ కర్తవ్యాన్ని నెరవేర్చవలసిఉంది. రాజాజీ మద్రాసులో ఉపన్యసించినట్లు, భారతీయులందరూ ఏకాభిప్రాయానికి వస్తేగాని పరిష్కారం సాధ్యపడదు. స్వాతంత్ర్యం ఒకరు యిచ్చి పుచ్చుకునే వస్తువైతే, ఐక్యత అవసరమే ఉండేది కాదు. జిన్నా వైఖరిలో మార్పు తీసుకురావడం ప్రజలందరి కర్తవ్యం అయివుంది. ఇందుకు ముస్లింప్రజలు కోరే స్వయంనిర్ణయ హక్కును గుర్తించడం అవసరం.

23—8—43

★ కేంద్రశాసనసభలో ఆహారసమస్యపై చర్చ ★

ప్రభుత్వ అసమర్థత: ప్రజల కర్తవ్యం

దేశంలో ఆహారపదార్థాల సమస్య నానాటికీ తీవ్రతరమౌతోందనే యదార్థాన్ని ఇండియాప్రభుత్వం గుర్తించింది. కాని ప్రజల సహకారంలేనిదే దీని పరిష్కారం అసాధ్యమనే విషయాన్ని అది యింకా గ్రహించడంలేదు. తిండిదొంగల స్టాకు లన్నింటినీ స్వాధీనపరచుకొని కరువుప్రాంతాలకు, అవసరప్రదేశాలకు సమగ్రమైన ఒకప్లానుప్రకారం ఎప్పటికప్పుడు ఎగుమతి చేసే విధానాన్ని అవలంబించకపోవడంవల్ల ఒకరాష్ట్రానికీ— మరోరాష్ట్రానికీ మధ్య, రాష్ట్రాలకూ — కేంద్రప్రభుత్వానికీ మధ్య, తీవ్ర ఘర్షణ లేర్పడ్డాయి. మొన్న ఆగస్టు 9, 10 తేదీలలో జరిగిన ఎసెంబ్లీ చర్చలలోను, 12, 13 తేదీలలో జరిగిన స్టేట్ కౌన్సిల్ చర్చలలోను, ఈవిషయం తేటతెల్లమయింది.

★

ఈనెల 9వ తేదీని ఇండియాప్రభుత్వ సభ్యుడైన సర్ అజిజుల్‌హక్ ఎసెంబ్లీలో ఆహార సమస్యను గురించి యిచ్చిన ప్రారంభోపన్యాసంలో, వివిధ రాష్ట్రాల నిరంకుశాధికారులు ఏవిధంగా ప్రజలకు తిండి సప్లయి కాకుండా ఆటంకపరుస్తూ వచ్చారో తెలియజేశాడు. మేనెలలో బెంగాల్ సమస్య విషమించడంవల్ల, బెంగాల్- బీహార్-ఒరిస్సా-అస్సాం రాష్ట్రాలలో స్వేచ్ఛావ్యాపార పద్ధతిని ప్రవేశపెట్టవలసి వచ్చింది. కాని, వివిధ రాష్ట్రప్రభుత్వాలు, నిరంకుశోద్యోగులు, కలిసి యీ పద్ధతిని భగ్నంచేయడానికి సర్వశక్తులూ వినియోగించారు. బెంగాల్‌లో ప్రజలు తిండిలేక వీధులలో మరణిస్తూంటే, ఇతర రాష్ట్రాల నుండి బెంగాల్‌కు పంపడానికి కొన్న సరుకును సహితంఆయారాష్ట్రాలలో స్వాధీనపరచుకున్నారు; వెళ్లేసరుకులో కొంత వదులుకొనేటట్లుచేశారు; గిడ్డంగులమూసివేయవలసిందని ఉత్తరువు లిచ్చారు; సరుకు అమ్మవద్దని వర్తకులమీదఆంక్ష విధించారు; వేగన్ల నీయవద్దని స్టేషన్ మాస్టర్లను ఒత్తిడి చేశారు. ఒక చోటనుండి మరోచోటకు బళ్లమీద సరుకు పోకుండా నిలుపుచేశారు; ఎగుమతులే కట్టిపెట్టవలసిందని ఆర్డర్లు జారీచేశారు. ప్రభుత్వ ఏజంట్లను (బెంగాల్, లేక ఇండియా ప్రభుత్వంచే నియమించబడ్డవారిని) ఎరస్టుచేశారు; తక్కువ ధరలకు అమ్మవద్దని రైతులకు సలహా యిచ్చారు. ఇట్టి వినాశకరమైన చర్యలకు మందిపడనివారెవరూ ఉండరు.

దొంగకు తలుపుతీసి....

అయితే, ఇన్ని దుర్మార్గాలకు కారకులైన నిరంకుశోద్యోగుల్ని ఇండియా ప్రభుత్వం ఏమిచేసింది? వారి విషయమై ఇంకా "ఇన్‌వెస్టిగేట్" చేస్తున్నామని అజిజుల్‌హక్ జవాబిచ్చాడు. ప్రజల ప్రాణాలతో చెలగాటాలాడిన అధికారవర్గాన్ని ఉచిత రీతిని శిక్షించకుండా, ఇంకా ఆలోచించు తున్నారట! దొంగకు తలుపుతీసి, దొరను లేపినట్లు, ఇండియా ప్రభుత్వం ఇన్నాళ్ళనుంచీ వీరి విషయంలో ఉపేక్షవహించి, ఇప్పుడు ఎసెంబ్లీ హాలులో సభ్యుల యెదుట వీరి చర్యల్ని బయట పెట్టినంత మాత్రంచేత చాలదు. వెంటనే వీరిపై కఠినచర్య తీసుకొని, యితరులకైనా గుణపాఠం చెప్పడం అవసరం. ఒక రాష్ట్రానికీ-మరో రాష్ట్రానికీ మధ్య అన్యోన్య సహకారం లేనిదే, ఎంత చక్కని స్కీము వేసినా నిరుపయోగం కాక తప్పదంటూ ప్రభుత్వసభ్యుడు వాదించాడు. "దీర్ఘకాలపు ఆహారకమిటీ" ఒకటున్నదట! అదొక రిపోర్టు తయారు చేస్తూన్నదట! ఆరిపోర్టు వచ్చిన వెంటనే ప్రభుత్వం కార్యాచరణకు పూనుకొంటుందట! ఇంకా యెంతకాలం యిలా రిపోర్టులతోను, చర్చలతోను, ప్రభుత్వం కాలం గడుపదలచిందో తెలియదు.

సభ్యుల అభిప్రాయాలు

ఈ ఉపన్యాసంపై అసెంబ్లీసభ్యులు చర్చ సాగించారు. ఏపార్టీవారూ ప్రభుత్వవిధానాన్ని సమర్థించలేదు. దేశాని కంతకూ ఒకసమగ్రమైన ప్లానులేకుండా, నేరస్థుల్ని శిక్షించకుండా, ఉపేక్షవహించడం క్షంతవ్యం కాదని అన్నిపార్టీలవారు తెలియజేశారు. ప్రజల పౌరస్వాతంత్ర్యాలను అణచగలిగిన ఇండియా ప్రభుత్వం, ప్రజలకు తిండిపెట్టే విషయంలో తనకున్న అధికారాన్నెందుకు వినియోగించరాదని టి. టి. కృష్ణమాచారి ప్రశ్నించాడు.

ప్రభుత్వ ఏజంట్లే కంట్రోల్ నిబంధనలను ధిక్కరించారనీ, నిల్వవ్యాపారస్థుల్ని మార్షల్‌లా కింద శిక్షించడానికి బదులు వారిని ప్రభుత్వం చూస్తూ ఊరకొన్నదనీ, సర్ యం. యమీన్‌ఖాన్ ఖండించాడు. ఒక ప్రధానమంత్రిచే రాజీనామా ఇప్పించగలిగిన ప్రభుత్వం తన పాలసీకి వ్యతిరేకంగా ప్రచారం చేసిన మరొక మంత్రిచే ఎందుకు రాజీనామా ఇప్పించకూడదని ఎన్. ఎం. జోషీ ప్రశ్నించాడు. అసలు ఎగ్జిక్యూటివ్ కౌన్సిలర్లలోనే ఏకాభిప్రాయం ఎలా లేదో ఉదాహరణపూర్వకంగా వివరించాడు. ప్రభుత్వం తన రాజకీయ పాలసీని కూడా మార్చుకుంటేగాని యీసమస్య పరిష్కారం కాదని ఖచ్చితంగా తెలియజేశాడు.

యూరపియన్ సభ్యుల ఖండన

యూరపియన్ గ్రూప్‌కు నాయకుడయిన సర్ హెన్రీరిచ్చర్డ్‌సన్ ఇలా ఉపన్యసించాడు:

"ప్రజలు తిండిలేక అలమటిస్తూంటే, దేశం అంతటా అసంతృప్తి జ్వాలలు వ్యాపిస్తూంటే, ప్రభుత్వం చిల్లరశాసనాలతో కాలం వెళ్ళబుచ్చుతోంది. ఆహార సమస్యను మొదట పరిష్కరించి, తరువాత నెమ్మదిగా వాటిని తీసుకొనియుండవలసింది. ఇన్నాళ్ళనుండి దేశంలో జరిగిన ఘటనలవల్ల గుణపాఠం యిప్పుడయినా నేర్చుకోకుండా,కాలవిలంబనంచేయడం ఎంతో విచారించదగిన విషయం .... నిల్వ వ్యాపారాన్ని అణచుటకు ఇంతవరకు తీసుకున్న చర్యలు ఏమాత్రం సరిపోవు. నిల్వ వ్యాపారస్థుల పేర్లను దేశంలో అన్నిమూలల వెల్లడిచేసి, కఠినమైన శిక్షలు విధించాలి."

వి. జె. గ్రిఫిత్సు యిలా అన్నాడు: "కేంద్రప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలపై అనేకవిధాల పరోక్షంగా ఒత్తిడి తీసుకురావచ్చును. నేడు 93వ సెక్షన్ కింద పరిపాలించబడే కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలే యితర రాష్ట్రాలకంటె మూర్ఖంగా ప్రవర్తించాయి:"

ముస్లింలీగ్ నాయకుని విమర్శన

ముస్లింలీగ్ నాయకుడైన లియాఖత్ ఆలీఖాన్ యీ క్రింది వాక్యాలతో ప్రభుత్వ విధానాన్ని విమర్శించాడు:- "యీసమస్యను పరిష్కరించడానికి ప్రభుత్వం ఏయే చర్యలు తీసుకొన బోతూందో తెలియజేయ లేదు. యుద్ధం ప్రారంభమై యిన్ని సంవత్సరాలైనప్పటికీ, ప్రభుత్వం ఒక ప్రత్యేక ఆహార శాఖను నిర్మించకపోవడం క్షమించరాని ఉపేక్షాభావం. దేశంలో ప్రజాశాంతి కనువైన వాతావరణాన్ని కలిగించక పోవడంకూడా క్షమించరానిదే. ప్రభుత్వ దృష్టిలో, రాష్ట్రాలేవీ సహకారం చేయుటలేదు; రాజకీయ పార్టీలు సహకారం చేయుటలేదు. ఇక సహకారం చేసే దెవరు!? ప్రభుత్వంలో ఉన్న కీలుబొమ్మలు. ఈ దేశంలో ప్రజాభిప్రాయంఅంటే ప్రభుత్వం అసహ్యాభావంతో చూస్తూంది. అట్టిప్రభుత్వం యీరోజున ప్రజల సహకారం కోరడానికి యెట్టి హక్కూలేదు."

అంతర్యుద్ధం

ఈవిధంగా కేంద్రప్రభుత్వసభ్యుడు వెక్కిరించబోయి వెల్లకిలబడ్డాడు. అన్నిపార్టీలవారి చేత ప్రభుత్వం బట్టబయలుచేయబడింది.కాని, ఒక రాష్ట్రానికీ-మరో రాష్ట్రానికీమధ్య అంతర్యుద్ధంకూడా శాసనసభలో తీవ్ర రూపం దాల్చింది. బెంగాల్ ప్రభుత్వం బియ్యానికి కొనుగోలు ధరను, విక్రయ ధరనుకూడా రు.6 ల చొప్పున నిర్ణయించడంవల్లనే వర్తకులకు కొంచెంకూడా లాభంమిగలక, స్టాకులన్నింటినీ దాచివేశారని అబ్దుల్ అలీమ్ తెలియజేశాడు. తన రాష్ట్రానికి దాదాపు 8 టన్నుల బియ్యం పంపుతామని వాగ్దానంచేసి 4 లక్షల టన్నులమాత్రమే సప్లయిచేసిన కేంద్రప్రభుత్వానికి బెంగాల్ ప్రభుత్వం తన ప్లానులన్నీ ఎందుకు తెలియపరచాలి? అని కె. సి. నియోగి (బెంగాల్) ప్రశ్నించాడు. హైదర్ ఇమాం, అబ్దుల్ రషీద్ చౌదరీ (బీహార్-అస్సాం) లు బెంగాల్ - బీహార్-ఒరిస్సా - అస్సాం లలో స్వేచ్ఛా వ్యాపార పద్ధతివల్ల ధరలు విపరీతంగా పెరిగి, తమ రాష్ట్రాలలో కరువు పరిస్థితు లేర్పడ్డాయని నిరూపించారు. సింధు ప్రభుత్వం మణుగు రు. 6, 7 చొప్పున రైతులవద్ద గోధుమలు కొని, రు. 15 చొప్పున యితర రాష్ట్రాలకు పంపి, లాభాలు సంపాదిస్తోందని సర్దార్ శాంతసింగ్ (పంజాబ్) ఆరోపించాడు. కాని, పంజాబుకూడా యిలాగే చేస్తూన్నదనీ, కొన్ని సందర్భాలలో యితర రాష్ట్రాలకు స్టాకుల్ని పంప నిరాకరిస్తోందనీ, వెంటనే కొందరు సభ్యులాక్షేపించారు. దీనికిజవాబుగా, కావలసినన్ని పంజాబుగోధుమలు ఎగుమతికి సిద్ధంగా ఉన్నవనీ, కొనేవారుమాత్రం లేరనీ, శాంతసింగ్ చెప్పాడు.

ప్రభుత్వ సభ్యుని మొండిచెయ్యి

ఈ విధంగా, అవులూ అవులూ కొమ్ములాడుకొని, లేగల కాళ్ళు విరచినట్లు, వివిధ రాష్ట్ర ప్రభుత్వాలమధ్య, రాష్ట్రప్రభుత్వాలకూ ఇండియా ప్రభుత్వానికి మధ్య జరుగుతూన్న అంతర్యుద్ధం పేద ప్రజలకు తిండి లభించకుండా చేస్తూంది. ప్రభుత్వ సభ్యుడు చర్చకు జవాబిస్తూ, తాము తలపెట్టిన యేర్పాట్లన్నీ పూర్తి అయేవరకు భవిష్యత్కార్యక్రమాన్ని గురించి చెప్పడానికి వీల్లేదని మొండిచెయ్యి చూపించాడు.

12, 13 తేదీలలో స్టేట్‌కౌన్సిల్‌లో జరిగిన చర్చకూడా ఎసెంబ్లీ చర్చకు అనుకరణే నని చెప్పవచ్చు. ఈ చర్చలతో కేంద్ర ప్రభుత్వం తలదిమ్మెక్కికాబోలు, బెంగాల్-బీహార్- ఒరిస్సా- అస్సాం రాష్ట్రాలలో స్వేచ్ఛావ్యాపారపద్ధతిపై మళ్ళీ పూర్వంమాదిరి ఆంక్ష విధించింది. అయ్యవార్లంగారు ఏంచేస్తున్నారని అడిగితే, చేసిన తప్పులు దిద్దుకుంటున్నారని శిష్యుడు ఎల్లప్పుడూ జవాబు చెబుతాడట! బ్రిటిష్ నిపుణులు కొందరు, తక్షణమే అమెరికా- కెనడా దేశాలు ఇండియాకు గోధుమలు ఎగుమతి చేయాలని సూచించుతున్నారు. కాని, అవి ఇండియాలో దిగిన వెంటనే ప్రభుత్వం వాటిని సక్రమంగా ప్రజలకు పంచగలిగిన చాకచక్యం ఉండాలి. ఇప్పటి మాదిరిగానే ప్రజాసహకారం తీసుకోకుండా, నిరంకుశోద్యోగులపై ఆధారపడుతూ, తిండిదొంగలవిషయంలో కఠినచర్యలేవీ తీసుకొనకుండా ఉంటే, ఎన్ని స్టాకులు దిగుమతి అయినా నిరుపయోగం.

ముందు కర్తవ్యం

ఇండియాప్రభుత్వం యిప్పుడైనా ఉపేక్షాభావం వదలి, యీక్రింది కార్యక్రమంతో ఆహారసమస్యను పరిష్కరించాలి:

1. ప్రజలకు ఆహారం అందకుండాచేసిన నిరంకుశోద్యోగులపై కఠినచర్య తీసుకోవాలి.

2. నిలవ వ్యాపారస్థులవద్దనున్న స్టాకులన్నింటినీ స్వాధీనంచేసుకొని, వాటిని పబ్లిక్ గిడ్డంగులలో నిలవజేసి, రేషనింగ్ ప్రకారం ప్రతి పట్టణంలోను, తరుగు గ్రామాలలోను అమ్మించాలి.

3. దేశాని కంతకూ యిప్పుడున్న సరుకు మొత్తం, కావలసినమొత్తం ఎంతెంతో సమగ్రమైన ప్లాను వేయాలి. తరుగు ప్రాంతాలకు ప్రభుత్వమే రవానా చేయాలి.

4. దేశాని కంతకూ ఆహారపదార్థాల ధరలను కంట్రోలు చేయాలి.

5. ఈ పనులన్నీ ప్రజా ప్రతినిధులతో గూడిన ఆహారకమిటీల సహకారంతో నిర్వహించాలి.

ఇటు ప్రజలుకూడా, దేశంలో పరిస్థితులు విషమించి జపాను దండయాత్రకు అనుకూల వాతావరణం ఎలాయేర్పడుతోందో గ్రహించి, తామే స్వయంగా సమస్యను పరిష్కరించుకోవడానికి ముందుకు రావలసియుంది.

డెల్టాప్రాంతాలలో వ్యవసాయ కూలీలకు, ఇతర ప్రజాసామాన్యానికి కొత్త పంటలు వచ్చేవరకు సరిపోవుధాన్యపు స్టాకులను భద్రంచేసి, మెచ్చు ధాన్యం ప్రభుత్వానికి ఆహారకమిటీలద్వారా ప్రజల కందుబాటులో ఉండే ధరలకు అమ్ముటకు ముందుకురావాలి. అప్పుడే తిండిదొంగలవద్దఉన్న ధాన్యపుస్టాకుల్నికూడా ప్రభుత్వం కంట్రోలుధరలకు స్వాధీనంచేసుకొని, కొరతప్రాంతాలకు సకాలంలో పంపగల్గుతుంది. తిండిదొంగలు తమవద్దనున్న స్టాకుల్ని అమ్మకుండా దాస్తూన్నప్పుడు, వాటిని ప్రభుత్వం ప్రజల సహకారంతోబైటకు లాగకుండా తటపటాయిస్తూన్నప్పుడు, రైతులుకూడా తమవద్దనున్నమిగులు ధాన్యాన్ని దాచుకోవడం ప్రారంభిస్తే, కొరత ప్రాంతాలలోను, పట్టణాలలోను, స్టాకులు త్వరలోనే అయిపోయి, కరువుదోపిళ్ళు, గ్రామాలకు- పట్టణాలకుమధ్యఅంతర్యుద్ధాలు బయల్దేరుతాయి. ప్రజల్ని పీటిసుండి ఎవ్వరూ రక్షించలేకుండాపోతారు. పైగా నిరంకుశాధికారులు నిర్బంధ విధానాన్ని అధికం చేస్తారు. ఈవిధంగా ప్రజలలో అంతఃకలహాలొకవైపు,నిర్బంధవిధానం మరొకవైపుఉంటే దేశానికి జపాన్ ఉపద్రవం మరింత హెచ్చుతుంది. ఈపరిస్థితుల్ని రైతులు తెలుసుకొని, అట్టి ప్రమాదాలు వాటిల్లకముందే ఆహారకమిటీల ద్వారా తమవద్దనున్న ధాన్యాన్ని సక్రమదరలకు అమ్మి దేశభక్తిని ప్రకటించవలసియుంది.

Printed and Published by Katragadda Rajagopala Rao at Prajasakti Press, Governorpet - Bezwada.

END OF ISSUE